



కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలో పాల్గొన్న అంగనవాడీలు



ఈఆర్‌వోల గుండెల్లో లబ్..డబ్

- నేడు, రేపు విజయవాడలో సీఈసీ, ఈసీలు
- పూర్తి కసరత్తుతో మూడు జిల్లాల అధికారులు
- ఓటర్ల జాబితాల్లో అక్రమాలపై ఫిర్యాదు చేయనున్న చంద్రబాబు, పవన్
- గుంటూరు పశ్చిమలో జరిగిన అక్రమాలను చంద్రబాబుకు నివేదించిన పార్టీ శ్రేణులు

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్ రాజీవ్‌కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు అరుణ్‌గోయల్, అనూప్‌చంద్ర పాండే మంగళవారం నుంచి రెండురోజులపాటు రాష్ట్రంలో పర్యటించనుండటంతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోల గుండెల్లో రైళ్లు పరుగెడుతోన్నాయి. సీఈసీ, ఈసీలు రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశమై ఇప్పటివరకు ఎస్ ఎస్ఆర్-2024కు సంబంధించి క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార పురోగతిపై సమీక్షించనున్నారు. అలానే సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత పైనా చర్చించనున్నారు. అలానే గుర్తింపుపొందిన రాజకీయపార్టీల అధ్యక్షులతోనూ సమావేశమై ఫిర్యాదులు స్వీకరించనున్నారు. సీఈసీనే స్వయంగా హాజరౌతుండటంతో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో పాటు ఇతర పార్టీల ముఖ్య నేతలు కూడా హాజరై ఫిర్యాదులు అందజేయాలని నిర్ణయించారు. దీంతో ఎవరిపై సీఈసీ కన్నెర్ర చేస్తారోనని అంతా భయపడి పోతున్నారు.

గుంటూరు జిల్లా ఫాం-7లపై అధికారుల ఉదాసీనం

స్పెషల్ సమ్మరి రివిజన్ - 2024 ప్రారంభమైన తర్వాత గుంటూరు నగరంలో పెద్దసంఖ్యలో బోగస్ ఫారం-7లను వైసీపీ నేతలు వారి అనుచరుల ద్వారా పెట్టించారు. ప్రతిపక్ష టీడీపీ, జనసేనకు సానుభూతి పరులుగా ఉండే ఓటర్ల పేర్లను లిస్టుల్లో నుంచి తొలగించడమే లక్ష్యంగా గంపగుత్తగా దరఖాస్తులు చేయించారు. నవంబరు 2 నుంచి 5వ తేదీ మధ్యన దాదాపుగా 2,500లకు పైగా ఓటు తొలగింపు దరఖాస్తులు చేయించారు. ఇవి ఎక్కువగా శేషిరెడ్డి కొండా, శేషిరెడ్డి చల్లా, వెం కాయమ్మ సిద్ధే, రాము లన్నలబౌతుల, వెంకటరెడ్డి పులుసు, సంజీవ రెడ్డి ఆనం పేర్లతో పెట్టించారు. దీనిపై తెలుగుదేశం పార్టీ నేతలు అభ్యంతరం పెట్టడంతో ఈసీ ఆదేశాల మేరకు రిటర్నింగ్ అధికారి సమక్షంలో విచారణ జరిగింది. విచారణలో తప్పుడు ఫారం-7లను అని తేలినప్పటికీ కఠినమైన సెక్షన్లు పెట్టకుండా బెయిలబుల్ సెక్షన్లు పెట్టి పోలీసు కేసు నమోదు చేయించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 9-8-34లో ధనలక్ష్మి సంగీత విద్యాలయం ఉండగా అక్కడ 60 ఓట్లు చేర్చారు. అలానే 9-1-19లో 85 ఓట్లు ఉంటే టీడీపీ ఫిర్యాదు మేరకు ఇప్పటివరకు 45 మాత్రమే తొలగించారు. కాగా మంత్రి విడదల రజని గుంటూరు పశ్చిమ వైసీపీ సమన్వయకర్తగా నియామకం కావడంతో ఆమె తన ఓటును చిలకలూరిపేట నుంచి బదిలీ చేసుకొనేందుకు తప్పుడు సమాచారంతో ఫారం-8 పెట్టారు. 9-2-98 డోర్ నెంబరులో ఖాళీస్థలం ఉండగా అక్కడ తాను నివసిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై కూడా టీడీపీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో చనిపోయిన ఓటర్ల పేర్లను అలానే కొనసాగించారు. వాటిని తుది ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి తొలగిస్తామని అధికారులు చెప్పారు. అయితే ఎన్ని తొలగించారనేది తెలియాల్సి ఉన్నది. డోర్-టూ-డోర్ పరిశీలనలో 27,297 మంది స్థానికంగానే నివాసం ఉంటున్నట్లు తేలింది. దాంతో వారి ఓట్లను తిరిగి ఓటర్ జాబితాలో చేర్చారు. అయితే రాజకీయ పార్టీలు వారి ఓట్ల తొలగింపునకు గతంలో దరఖాస్తులు పెట్టగా వాటిని బీఎల్‌వో, ఏఈఆర్‌వో, ఈఆర్‌వోలు ఆమోదించారు. ఎవరైతే తప్పుడు నిర్ణయాలు తీసుకొన్నారో వారిపై చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నాయకులు ఇప్పటికే టీడీపీ అధినేత చంద్ర బాబుని కలిసి ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం, వైసీపీకి పక్షపాతంగా వ్యవహరిస్తుండటంపై ఫిర్యాదు చేశారు. ఆయా ఆధారాలను చంద్రబాబు మంగళవారం సీఈసీకి ఇవ్వనుండటంతో ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్, కమిషనర్లు వాటిపై ఏవిధమైన చర్యలు తీసుకొంటారోనన్న ఉత్కంఠ నెలకొన్నది.

సోమవారమే విజయవాడకు బాపట్ల కలెక్టర్, ఎస్పీ

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం సాయంత్రమే విజయవాడ బయల్దేరి వెళ్లారు. సీఈవో సమీక్ష ఖరారు అయిన దగ్గర నుంచే జిల్లా అధికారులు దానికి సంబంధించిన నివేదికలను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఆదివారం ఎస్పీ కార్యాలయం మొత్తం ఇందుకు సంబంధించిన కసరత్తు లోనే నిమగ్నమయి ఉంది. ఇక సోమవారం కలెక్టర్, ఎస్పీ భేటీ కూడా ఇదే అంశం ప్రధాన ఎజెండాగా చర్చ సాగింది. సవివర నివేదికలతో కలెక్టర్, ఎస్పీ సీఈవో సమీక్షకు హాజరవనున్నారు.

పల్నాడులో ప్రక్షాళనపై ఇంకా సందేహాలే..

హలో.. ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారా? అయితే సచివాలయానికి రండి అంటూ బీఎల్‌వోల నుంచి దరఖాస్తు దారులకు ఫోన్ కాల్ వస్తుంది. ధ్రువ పత్రాలతో రావలసిందిగా వారు దరఖాస్తు దారులను ఆదేశిస్తున్నారు. ఫారం -7 విషయంలోనూ ఇదే తంతు. దరఖాస్తుదారులు సదరు పత్రాలతో సచివాలయానికి వెళ్లకుంటే ఆ వ్యక్తికి ఓటు నమోదు కానట్లే. ఇదీ పల్నాడు జిల్లాలో ఓటర్ల దరఖాస్తుల పరిశీలన తీరు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటుకు సంబంధించి అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్న నిబంధన ఉంది. దీనిని బీఎల్‌వోలు తుంగలో తొక్కుతున్నారు. జిల్లాలో నకిలీ ఓట్లు 18,035 ఉన్నట్లు రాజకీయ పార్టీలు గుర్తించాయి. ఈ మేరకు వీటిని తొలగించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నేతలు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. నియోజకవర్గాల వారీగా ఓటరు ఐడెంటీ కార్డు నెంబరు, డోరు నెంబరు కూడా తెలియజేస్తూ వివరాలు అందజేశారు. వీటిని ఈ సారైనా తొలగించేందుకు సదరు అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి. ఒకే ఓటర్లకు రెండు చోట్ల ఓట్లు నమోదయ్యాయి. వీటి విషయంలో అనేక మార్లు ఫిర్యాదులు ఇస్తున్నా అధికారులు స్పందించడంలేదన్న విమర్శలున్నాయి. ఇటువంటి ఓట్లు జిల్లాలో 3,841 ఉన్నట్లు నిర్ధారించారు. వీటిని సరిదిద్దడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జీరో డోర్ నెంబర్లపై జిల్లాలో 5,019 ఓట్లు నమోదయ్యాయి. దాదాపు జిల్లా వ్యాప్తంగా మరణించిన 23,100 మందికి ఓట్లు ఉన్నాయని గుర్తించారు. జాబితాలో వీటిని నమోదు చేసి సంబంధిత అధికారులకు తొలగింపు దరఖాస్తులు అందజేశారు. ఆయా విషయాలను టీడీపీ శ్రేణులు తమ రాష్ట్ర కార్యాలయానికి పంపారు. వీటిపై ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

పర్చూరుకు సంబంధించే టెన్షన్...

జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలన్నీ సమస్య కాక పోయినా పర్చూరు మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా వార్తల్లో ఉండడంతో అందుకు సంబంధించి సీఈవో ఏం అడిగినా జవాబిచ్చేదానికి కావాల్సిన రిపోర్టులన్నీ కలెక్టర్ తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా శాంతి భద్రతలకు సంబంధించి ఎస్పీ రిప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉన్నందున ఆ అంశంపై సమగ్ర నివేదికలతో సిద్ధమై వెళ్లారు.

భోజన విరామం తర్వాత...

బాపట్ల జిల్లాకు సంబంధించి సీఈవోకు ఇచ్చే రిప్రజెంటేషన్ మంగళవారం భోజన విరామం తర్వాత కొనసాగనుంది. బుధవారం కూడా కొనసాగే సమావేశంలో సవరణ ప్రక్రియ , ఎన్నికల సన్నద్ధతపై చర్చించనున్నారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులతో పాటు వాటిపై తీసుకున్న చర్యలు కూడా ప్రధానంగా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది.

తగ్గేదే లే

అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ ఉద్యమంలో వెనకడుగు వేసేది లేదని ఉద్యోగులు తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా ఏమాత్రం తగ్గేదిలేదని తేల్చి చెబుతున్నారు. చెప్పడమే కాదు.. తొలిరోజు చేసి చూపించారు కూడా! ఎస్మా ప్రయోగంపై అధికారులు ఎన్నిరకాలు ఒత్తిళ్లకు గురిచేసినా ఉద్యోగులు మాత్రం తొలిరోజు విధుల్లో చేరలేదు. దీంతో ఎస్మా హెచ్చరికల ప్రభావం మూడు జిల్లాల్లో ఎక్కడా పని చేయలేదని స్పష్టమవుతోంది.

- ఎస్మా ప్రయోగించినా వెనక్కితగ్గని అంగన్వాడీలు
- తొలిరోజు ప్రభావం చూపని ఎస్మా ఆదేశాలు
- ఒకటి రెండు చోట్ల మినహా అన్ని చోట్లా విధులకు దూరంగానే ఉద్యోగులు
- మిగిలిన అన్నిచోట్లా వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి తప్పని తిప్పలు
- టెంట్లు పీకేస్తామంటూ అధికారుల నుంచి హెచ్చరికలు
- రిలే, ఆమరణ నిరాహార దీక్షల దిశగా సిబ్బంది అడుగులు

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 5,100 అంగన్వాడీ, మిని అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. కిందటి నెల 12వ తేదీ నుంచి ఉద్యోగులు ఆందోళన చేపట్టడంతో అవి మూతపడ్డాయి. తరువాత వాటి తాళాలు పగలకొట్టి వాటి నిర్వహణ బాధ్యతను వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అప్పగించారు. కానీ అది సత్ఫలితాలను ఇవ్వలేదు. వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా తయారయింది. బాలింతలు, గర్భిణులకు వండి పెట్టడం, పోషణ అందజేయడం నామమాత్రంగా మారిపోయింది. గడిచిన నెల రోజులుగా ప్రీస్కూలు చిన్నారుల హాజరు 20 శాతం కంటే తక్కువగా నమోదవుతోంది. సోమవారం 27 శాతం నమోదయినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. దీంతో ఉద్యోగులను బలవంతంగానైనా ఆందోళన నుంచి విరమింపజేయాలని ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడానికి సిద్ధమైంది. అయినప్పటికీ ఆ ప్రభావం ఏమాత్రం పనిచేయలేదు.

● ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం

తమ సమస్యలపై ఆందోళన చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను చర్చలకు పిలవకుండా పక్కన పెట్టి సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాలను సోమవారం చర్చలకు పిలవడం ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది. తమకు సంఘీభావం ప్రకటించిన సంఘాలను బెదిరించి, సంఘీభావం లేకుండా చేయాలన్న కుట్రతోనే ప్రభుత్వం, అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉద్యోగుల నిరసన శిబిరాలను తొలగిస్తామని అధికారులు హెచ్చరికలు పంపినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. అదేగనుక జరిగితే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు. ఎస్మా ప్రయోగంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. తమ విధులు అత్యవసర సేవల పరిధిలోకి రావని, కోర్టులోనే ఇది తేల్చుకుంటామని చెబుతున్నారు. ఎస్మా ప్రయోగాన్ని నిరసిస్తూ నిరాహార దీక్షలకు సంసిద్ధమవుతున్నారు. ప్రభుత్వం గనుక నిరసన శిబిరాలను తొలగిస్తే అక్కడే రిలే నిరాహార దీక్షలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు.



తెనాలి: మార్కెట్ సెంటర్‌లో మానవహారంలో అంగన్‌వాడీలు

● నిరాహార దీక్షలు చేపడతాం: దీప్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం ఉద్యోగులను బలవంతంగా లొంగదీసుకోవాలని చూస్తోంది. మరో వైపు ఆందోళనా శిబిరాలను పీకేయాలని చూస్తోంది. ఎస్మా ప్రయోగించి ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవాలనుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ప్రభుత్వం ఇలానే బెదిరింపులకు దిగితే ఉద్యమం మరింత ఉధృతమవుతుంది. ప్రభుత్వం మా టెంట్లు బలవంతంగా పీకేయాలని చూస్తోంది. అదే జరిగితే అక్కడే నిరాహార దీక్షలకు దిగుతాం.

● ఉద్యమాన్ని నీరుగార్చే కుట్రలు తగవు: టీ రాధ, గుంటూరు నగర కార్యదర్శి

అంగన్వాడీ ఉద్యోగులకు సరైన పరిష్కారం చూపాలి. కనీసం సరైన రీతిలో చర్చలు కూడా జరపకుండా ప్రభుత్వం నిర్బంధ పద్ధతులు అవలంబిస్తోంది. నిర్బంధం వల్ల ఉద్యమం మరింత ఉధృత మవుతుంది. ఎస్మా పేరు చెప్పి బెదిరిస్తే బెదిరేది లేదు. ఉద్యోగులు ఉద్యమం నుంచి విధుల్లోకి వస్తున్నారని తప్పుడు లెక్కలు చూపడం సిగ్గుచేటు.

● మూడు జిల్లాల్లో 200 కేంద్రాల్లో ఉద్యోగులు

మూడు జిల్లాల్లో 5వేలకు పైగా అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, సోమవారం 200 మంది వరకూ విధులకు హాజరయినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. గుంటూరు నగరంలోనే ఎక్కువమంది విధులకు హాజరయ్యారు. కాగా గ్రామీణ ప్రాంత ఉద్యోగులు మాత్రం పట్టుదలగా ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారం గుంటూరు సీడీపీవోలో 127, మంగళగిరిలో 50, పిరంగిపురంలో 5, పొన్నూరులో 13, ప్రత్తిపాడులో 46, తెనాలిలో ఒక అంగన్వాడీ కేంద్రం తెరిచినట్లు అధికారులు చెబుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం చూసుకున్నా గుంటూరు జిల్లాలోని 1482 అంగన్వాడీ కేంద్రాల్లో 240మంది మాత్రమే విధులకు హాజరయ్యారు. అయితే ఈ గణాంకాలు తప్పని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఉద్యమాన్ని నీరుగార్చడానికి అధికారులు ఇలాంటి తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఉద్యోగులు అంటున్నారు. ఆందోళన విరమించి విధుల్లో చేరుతున్నారన్న ప్రచారం కల్పించడానికే ఐసీడీఎస్ అధికారులు ఇలా తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.



మంగళగిరిలో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు, అంగన్‌వాడీలు



పొన్నూరు: దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న న్యాయవాది షేక్ బాజీ సాహెబ్

అంతా చెత్తమయం

- గుంటూరులో పడకేసిన పారిశుధ్యం
- అధ్వానంగా ప్రధాన రహదారులు
- కంపు కొడుతున్న ప్రధాన వీధులు
- కార్మికుల సమ్మెతో రోజురోజుకీ క్షీణిస్తున్న పారిశుధ్యం

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 8 : పారిశుధ్య కార్మికులంతా గత వారం రోజులుగా సమ్మెలో ఉన్నారు. దీంతో గుంటూరు నగరం చెత్తమయంగా మారింది. ఏ ప్రాంతంలో చూసిన... ఏ వీధిలో చూసిన... ఏ రోడ్డు మీద చూసిన... చెత్త, చెదారంతో నిండిపోయి ఉన్నాయి. ప్రధాన వీధులన్నీ దుర్వాసన... కుళ్ళిన కంపు రావటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సంస్థలో మొత్తం 2300మంది పారిశుధ్య కార్మికులు ఉండగా, అందులో 260మంది పర్మినెట్, మిగిలిన 2050మంది ఆప్కాబ్ కింద పని చేస్తున్నారు.. నగరంలో గత వారంరోజులుగా ఏఐటీయూసీ, సీఐటీయూ సహా ఇతర అన్నిరకాల యూనియన్లు జేఏసీగా ఏర్పడి నోటీస్ ఇచ్చి సమ్మెలోకి వెళ్లారు. దీంతో నగరంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి ఉంది. ఇంటింటా చెత్త సేకరణ లేదు, ప్రధాన రహదారుల సైతం ఊడ్చేవారు లేకుండా పోయారు. కేవలం వాణిజ్యసంస్థల వద్ద మాత్రమే చెత్త సేకరణ జరుగుతోంది. గృహాలు, అపార్ట్‌మెంట్ వద్ద, ఇతర చోట్ల చెత్త సేకరణ జరగటం లేదు. దీంతో అపార్ట్‌మెంట్లలో, ఇళ్లల్లో ఎక్కడ చెత్త అక్కడే నిల్వ ఉండిపోయింది. పరిస్థితి ఇలానే ఉంటే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.



జగన్ మాయమాటలు జనం నమ్మరు

- ముద్దులు పెట్టి అధికారంలోకి వచ్చి గుద్దులు గుద్దుతున్నాడు
- రైతుల ఆత్మహత్యలో రాష్ట్రం 2-3 స్థానాల్లో ఉంది
- సంక్షేమం పేరుతో భూమి, ఇసుక, సహజ వనరుల దోపిడీ
- మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, జనవరి 8: ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్ర చేస్తూ ప్రజలకు ముద్దులు పెట్టి అనేక హామీలను ఇచ్చారని అధికారంలోకి వచ్చాక ప్రజల ముందుకు రాకుండా పరదాల మాటున తిరుగుతూ ఇచ్చిన హామీలను మరిచి అన్నింటా ధరలు పెంచి, పిడుగుద్దులు గుద్దుతూ పాలన చేస్తున్నాడని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. సోమవారం నుంచి ప్రజాయాత్ర పేరుతో నియోజకవర్గంలో ఆయన పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగన్ పాదయాత్ర చేసే సమయంలో నేను విన్నాను, చూశాను అంటూ అధికారంలోకి వచ్చిన వెంటనే అందరికి మంచి జరిగేలా పాలన చేస్తానని ఒక్క అవకాశం ఇవ్వాలని వేడుకున్నాడని చెప్పారు. ప్రజలు ఆయన మాటలు నమ్మి అధికారంలోకి తీసుకువస్తే ప్రజల సంక్షేమాన్ని మరిచి అదే ప్రజల పేరుతో దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. వ్యవసాయం దండుగ కాదు పండుగగా చేస్తానన్న జగన్ తీరా అధికారంలోకి వచ్చిన తరువాత నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు కూడా మనసు రాలేదని, దేశంలోనే రాష్ట్రం రైతుల ఆత్మహత్యల్లో 2-3వ స్థానాల్లో ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆత్మహత్యచేసుకున్న ఒక్క రైతు కుటుంబానైనా పరామర్శించి ఓదార్చలేదంటే ఈ ప్రభుత్వం వ్యవసాయాన్ని ఏ విధంగా పండుగగా చేసిందో అన్నదాతలందరూ ఆలోచించాలన్నారు. సాగుకు అవసరమైన నీరు చివరి భూమి వరకూ వచ్చాయా .. కాలువలు పూడికలు సకాలంలో తీశారా.. అధికార యంత్రాగం రైతులకు చేసిన మంచి ఒక్కటైనా ఉందా .. తెలుగుదేశం హయాంలో రైతాంగానికి అన్ని విధాలుగా మేలు జరిగింది. అదే విధంగా సంక్షేమం అని ప్రజలకు చెప్పిన జగన్ ఆయన పాలనలో ఏ ఒక్క వర్గానికైనా న్యాయం చేయగలిగారా లేదో ప్రజలే ఆలోచించాలన్నారు. ఆయన పాలనలో సామాజిక వర్గాల మధ్య చిచ్చుపెట్టి ప్రజల ఓట్లతో అధికారంలోకి రావాలనే తపన తప్ప అదే సామాజిక వర్గాల వారీగా అభివృద్ధి చేయడానికి మాత్రం మనస్సు రావడంలేదన్నారు. జగన్ పింఛన్ రూ.3000 చేశానని చెబుతున్నాడని టీడీపీ అధిరానంలోకి రాకముందు రూ.200 అందించేవారని చంద్రబాబు సీఎంగా దానిని రూ.2000కు పెంచారని, జగన్ దగ్గరదగ్గరగా నాలుగునరసంవత్సరాల 8 నెలల కాలంలో కేవలం పెంచింది రూ. 1000 మాత్రమేనని ప్రజలందరూ గమనించాలన్నారు. ఆ నాడు అమరావతిని రాజధాని అభివృద్ధి చేద్దామన్న జగన్ అధికారంలోకి వచ్చినాక అమరావతిని నిర్వీర్యం చేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నాలు జరిపారన్నారు. ఈ ప్రభుత్వం గొప్పలు చెప్పడంతప్ప కనీసం రోడ్లుకూడా వేయలేకపోయారని రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం, జనసేన ఉమ్మడి పాలనలోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి తెలుగుదేశం, జనసేన అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రానికి పట్టిన చీడ జగనను వదిలించుకుందామని తెలుగుదేశం ఎన్నికలు వచ్చేవరకూ ప్రజలను చైతన్యవంతులను చేస్తూ పాదయాత్ర చేస్తానని ఆలపాటి స్పష్టం చేశారు.



అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు, ఆలపాటి రాజేంద్రప్రసాద్



అంగలకుదురులో పాదయాత్రగా వెళుతున్న మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనంద్‌బాబు, పెద్దసంఖ్యలో ఇరు పార్టీల శ్రేణులు

వైసీపీకి ఓటమి భయం

● రాష్ట్రంలో సంక్షేమం పేరుతో దోపిడీ

● మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

తెనాలి రూరల్, జనవరి 8: నీరో చక్రవర్తిగా మారిన జగన్ పాలను గద్దెదించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద్‌బాబు ఆరోపించారు. సోమవారం తెనాలిలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తలపెట్టిన ప్రజాయాత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆనందబాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని జగన్ అప్పుల పాలు చేస్తూ ప్రజలకు సంక్షేమం అంటూ సంక్షోభ పాలనకు తెరలేపారని విమర్శించారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేసి అన్నగా మహిళలకు అండగా నిలుస్తానని చెప్పిన జగన్ మద్యం షాపులు పెంచి ఏరులై పారిస్తున్నారని ఆక్షేపించారు. చరిత్రలో పేదవాడి సంక్షేమం పేరుతో ఇంత పెద్దమొత్తంలో దోచుకోవచ్చని ఈ ప్రభుత్వం నిరూపించిందని విమర్శించారు. చంద్రబాబు అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు నడిపారని, చంద్రబాబు సీఎంగా తాను మంత్రిగా 5600కిలోమీటర్ల మేర గ్రామాల్లో పట్టణాల్లో రోడ్లువేసి అభివృద్ధి చేశామని చెప్పారు. జగన్ పాలనలో ఒక్క కిలో మీటరైనా రోడ్డు వేయగలిగారా అని ప్రశ్నించారు. దళితులకు అందించాల్సిన నిధులను కూడా పక్కదోవ పట్టించిన జగన్ ప్రభుత్వం నా ఎస్సీలు, నాఎస్టీలూ అంటూ దీర్ఘంతీస్తూ లేని ప్రేమను వలకబోయడం తప్ప ఇంకేం చేయగలరని ఎద్దేవా చేశారు. ప్రజలను వంచించిన వైసీపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. జగన్‌కు, వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని ఉద్యోగులు నిరసన చేస్తుంటే చర్చలకు రమ్మని కబురుపెట్టే సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణలు వారితో ఏం మాట్లాడతారో అర్థమయ్యే పరిస్థితి కూడా లేదన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబును గెలిపించుకుందామని ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ కలిసి తెలుగుదేశం జనసేన ఉమ్మడి నాయకత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

రైతులు, యువత నోట్లో మట్టికొట్టిన జగన్‌రెడ్డి ప్రభుత్వం

మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 8: నమ్మి ఓట్లువేసిన పాపానికి జగన్‌రెడ్డి రైతాంగం, యువతరం నోట్లో మట్టికొట్టారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. ఒక్క వ్యక్తి వల్ల ఒక రాష్ట్రం, ఒక తరం ఇంతగా నష్టపోయిన సందర్భం రాష్ట్రంలో, దేశంలో ఎప్పుడూ, ఎక్కడా లేదన్నారు. చిలకలూరిపేట క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడుతూ దగా పడిన ధాన్యం రైతుల ఆక్రందనలు, రోడ్డున పడిన ఉద్యాన, వాణిజ్య పంటల రైతుల ఆక్రోశాలే జగన్ అసమర్థ పాలనకు నిదర్శనం అన్నారు. మెగా డీఎస్సీ లేదు, ఏటా జాబ్ క్యాలెండర్లు లేవు, భర్తీ చేస్తామన్న 2.3 లక్షల ఉద్యోగాలూ లేవన్నారు. ప్రైవేట్‌రంగంలోనైనా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చూసుకుందామంటే ఈ సైకో పాలనలో పెట్టుబడులు, పరిశ్రమలు పారిపోయేలా చేశారన్నారు. వీటి ఫలితంగా నిరుద్యోగంలో రాష్ట్రాన్ని దేశంలో నెంబరు 1 స్థానంలో నిలిపారని ప్రత్తిపాటి వాపోయారు. విధ్వంసం తప్ప సంపద సృష్టి అన్న మాటే లేదన్నారు. రానున్న టీడీపీ, జనసేన ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనే ప్రాధాన్యాలు కానున్నాయన్నారు.

పొందుగల చెక్‌పోస్టు వద్ద రూ.12.50 లక్షల నగదు స్వాధీనం

దాచేపల్లి, జనవరి 8: రాష్ట్ర పోలీస్ చెక్‌పోస్టు పొందుగల వద్ద ఎటువంటి ఆధారాలు లేని రూ.12లక్షల 50వేల నగదును పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లి ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో పొందుగల పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారును తనిఖీ చేయగా అందులో 12 లక్షల 50 వేల రూపాయల నగదు వుండటాన్ని గుర్తించారు. హైదరాబాద్‌లోని షాద్‌నగర్‌కు చెందిన వైకుంఠ మధుసూదనరావుకు చెందిన నగదుగా గుర్తించారు. అతనివద్ద ఎటువంటి బిల్లులు, రసీదులు లేకపోవడంతో పోలీసులు ఆ నగదును స్వాధీనం చేసుకొని ఇన్‌కంట్యాక్స్ అధికారులకు స్వాధీనం చేశారు.

సీఎం రివర్స్ పాలన మాకొద్దు

● అభివృద్ధిలో దూసుకుపోయే నాయకుడు కావాలి ● 1483వ రోజుకు రైతుల ఆందోళనలు



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, జనవరి 8: సీఎం జగన్‌రెడ్డి రివర్స్ పాలన మాకొద్దు అని అభివృద్ధిలో ముందుకు దూసుకుపోయే నాయకుడు కావాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ, రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1483వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి పలువురు రైతులు మహిళలు మాట్లాడుతూ, మూడు రాజధానుల ప్రతిపాదన పెట్టి రాష్ట్రాభివృద్ధి లేకుండా చేస్తున్నారన్నారు. ఐదుకోట్ల మంది కోరుకునే అమరావతి రాష్ట్రం నడి బొడ్డులో ఉందన్నారు. అన్ని సౌకర్యాలతో అభివృద్ధి పనులు కొనసాగుతుంటే సీఎం జగన్‌రెడ్డి వచ్చి బ్రేక్ వేశాడన్నారు. అమరావతిని నిర్వీర్యం చేయటం అంటే శత్రువులు వచ్చి అభివృద్ధిని అడ్డుకున్నట్టు ఉందన్నారు. పాలన చేతకాకపోతే దిగిపోవాలన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేయటం దుర్మార్గమన్నారు. వేల ఎకరాలుండి కూడా రాజధాని నిర్మాణం కొనసాగించలేక పోవటం రాజకీయ దురుద్దేశమన్నారు. రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన చేస్తామని ప్రతిజ్ఞ చేసి మాట తప్పారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి, అభివృద్ధి పనులు కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. తుళ్లూరు, మందడం, వెలగపూడి, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, ఉద్దండ్రాయునిపాలెం తదితర రైతు ధర్నా శిబిరాలలో ఆందోళనలు కొనసాగాయి.

పాలిటెక్నిక్ లెక్చరర్లకు సాంకేతిక అంశాల్లో సమగ్ర శిక్షణ

ఏపీ సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి



ప్రసంగిస్తున్న ఏపీ సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి

మంగళగిరి సిటీ, జనవరి 8: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధే లక్ష్యంగా వివిధ సంస్కరణలు చేపడుతున్నామని, అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడంతోపాటు లెక్చరర్లకు సాంకేతిక అంశాల్లో సమగ్ర శిక్షణ ఇస్తున్నామని ఏపీ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సీ నాగరాణి చెప్పారు. మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఆరు రోజులపాటు జరగనున్న పాలిటెక్నిక్ లెక్చరర్ల శిక్షణా తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కమిషనర్ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగివున్న మేథాశక్తిని వెలికితీయాల్సిన బాధ్యత లెక్చరర్లదే అన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా మాట్లాడుతూ టీచర్లు, విద్యార్థుల నడుమ సరైన అవగాహన వుండాలన్నారు. సాంకేతికపరమైన అన్ని విషయాల్లోనూ పాలిటెక్నిక్ లెక్చరర్లు సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. శిక్షణాపరంగా అవసరమైన సహకారాన్ని ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ అందిస్తుందని తెలిపారు. అనంతరం టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చెన్నయ్‌కు చెందిన ఎన్‌ఐటీటీటీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేంద్రరావు, సంయుక్త సంచాలకులు వి.పద్మారావు, డీడీలు నాగేశ్వరరావు, ఎంఏపీ రామకృష్ణ, ప్రొఫెసర్ బాలగురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల నుంచి 128 మంది లెక్చరర్లు తరగతులకు హాజరయ్యారు.

కౌలు చెల్లించాలని సీఆర్డీఏ కార్యాలయం ముందు ధర్నా



విజయవాడ సీఆర్డీఏ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రాజధాని రైతులు, మహిళలు, రైతు కూలీలు

తుళ్లూరు, జనవరి 8: రాజధాని అమరావతి నిర్మాణానికి 33 వేల ఎకరాలు భూములిచ్చిన రైతులకు జీవనోపాధి పోతుందని పది సంవత్సరాలు కౌలు చెల్లించేలా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకొని ప్రతి ఏడాది మేలో కౌలు చెల్లిస్తూ వచ్చింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అమరావతి నిర్మాణ పనులు నిలిపివేయటంతో పాటు వార్షిక కౌలు చెల్లింపులో జాప్యం చేస్తోంది. ఎప్పటికప్పుడు కౌలు కోసం రైతులు రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఏడాది మే నెలలో వేయాల్సిన కౌలును ఇంతవరకు జమ చేయలేదు. దీంతో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ సీఆర్డీఏ కార్యాలయం ముందు రాజధాని గ్రామాల రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా నిర్వహించారు. రైతు కూలీలకు ఇచ్చే పింఛన్‌ను రూ.5వేలకు పెంచి ఇస్తామని సీఎం జగన్‌రెడ్డి ఎన్నికల ముందు హామీనిచ్చారు. అది కూడా నెరవేర్చలేదని వారు పేర్కొన్నారు. తొలుత సీపీఐ రాష్ట్ర నేతలు రామకృష్ణ, ముప్పాళ్ళ నాగేశ్వరావు, రైతులు, మహిళలు, రైతు కూలీలు రాజధాని అమరావతిలో సమస్యలు పరిష్కరించాలని సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ అలీంబాషకు వినతిపత్రం అందజేశారు. తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో తగినంత మంది సిబ్బంది లేరని, రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఇబ్బంది కలుగుతోందని జేఏసీ నేతలు అదనపు కమిషనర్‌కు విన్నవించారు. సాధ్యమైనంతవరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన రైతులకు హామీనిచ్చారు. తదనంతరం సీఆర్డీఏ కార్యాలయం ముందు కౌలు చెల్లించాలని ధర్నా చేశారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధులు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 8: స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీని సోమవారం న్యూఢిల్లీలో గల ఎంబసీ ఆఫ్ జపాన్ ప్రతినిధులు సందర్శించారు. ముందుగా ఎంబసీ ఆఫ్ జపాన్ ప్రతినిధులైన కౌన్సిలర్ కెంటారో ఒరిటా, సెకండ్ సెక్రటరీ రైతా సైటో, అడ్మినిస్ట్రేటివ్ అటాచీ రికుతో ఐటోలకు విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణం ఘన స్వాగతం పలికారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జపాన్ లాంగ్వేజీ సెంటర్ ఏర్పాటుచేయాలని జపాన్ ప్రతినిధులను కోరారు.

ఆర్వీఆర్ జేసీకి పరిశోధనలో అరుదైన పురస్కారం



అధ్యాపకుల్ని అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 8: స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల పరిశోధన విభాగానికి ఏఐసీటీఈ నుంచి పురస్కారం లభించినట్లు కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ, భారత ప్రభుత్వ ఇన్నోవేషన్ సెల్, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఏఐసీటీఈల సంయుక్త ఆధ్వర్యంలో కేఎల్ యూనివర్సిటీలో జరిగిన "ఇన్నోవేటివ్ భరత్ - ఐఐసీ రీజినల్ మీట్-2023"లో ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఇందులో కళాశాల బృందం ప్రదర్శించిన "నానోఫైబ్రోస్ డ్రెస్సింగ్"కు ప్రథమ బహుమతి లభించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు సోమవారం ప్రశంసా పత్రాన్ని అందించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ నుంచి గుంటూరుకు అక్రమంగా మద్యం రవాణా

● 165 మద్యం బాటిళ్లు స్వాధీనం, నిందితుడి అరెస్ట్

● ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ ఎం వెంకటేశ్వరరావు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ ఎం వెంకటేశ్వరరావు

గుంటూరు (కార్పొరేషన్), జనవరి 8: తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ నుండి గుంటూరుకు అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సోమవారం ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. గుంటూరు అమరావతి రోడ్‌లోని నగరాలకు చెందిన పాలెం రామ్మోహనరావు నల్గొండలో 165 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి గుంటూరు తీసుకొచ్చారు. నగరాల్లోని పట్టాభిసీతారామయ్యనగర్ రెండో లైనులో ఉంచినట్లు సెబ్ అధికారులకు అందిన సమాచారం మేరకు నిందితుడిని అదుపులో తీసుకొని మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుని అరెస్ట్‌చేసి కోర్టు హాజరు పరిచినట్లు అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ కర్త, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పార్లమెంటు నియోజకవర్గాల

కాంగ్రెస్ కోఆర్డినేటర్‌ల నియామకం

● గుంటూరు పార్లమెంట్‌కు ఉమాశంకర్

గుంటూరు, జనవరి 8: ఉమ్మడి జిల్లాలోని మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌లను ఏఐసీసీ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లోక్‌సభ స్థానాలకు కోఆర్డినేటర్‌లను నియమిస్తూ ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామకపు ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గానికి కృష్ణా జిల్లాకు చెందిన న్యాయవాది, ఆ పార్టీ నేత గంగశెట్టి ఉమాశంకర్, నరసరావుపేట పార్లమెంటుకు విజయవాడకు చెందిన న్యాయవాది, ఏపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వీ గురునాథం, బాపట్ల ఎస్సీ రిజర్వ్‌డ్ పార్లమెంటు నియోజకవర్గానికి ఒంగోలుకు చెందిన శ్రీపతి ప్రకాశంను నియమించారు. నగరానికి చెందిన ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్‌ను మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గానికి కో ఆర్డినేటర్‌గా నియమించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో సీనియర్ నేతలను పార్లమెంటు నియోజకవర్గాలకు సమన్వయకర్తలుగా నియమించటం జరిగిందని ఆ పార్టీ నేతలు తెలిపారు.


10న ఇండో ఇజ్రాయేల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన

● పల్నాడు రైతాంగం తరలి రావాలి

● ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు

నకరికల్లు, జనవరి 8: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో ఈ నెల 10వ తేదీన వ్యవసాయరంగంలో ప్రతిష్ఠాత్మకమైన ఇండో ఇజ్రాయేల్ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి పల్నాడు ప్రాంత రైతులు తరలి రావాలని నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు సోమవారం ఓ ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో నాణ్యమైన ఆహార ఉత్పత్తుల దిగుబడికి, ఎగుమతులకు, రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు నూతన వంగడాల వ్యాప్తికి కేంద్రంగా వ్యవ హరించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో ఏర్పాటయ్యే ల్యాబ్‌ల నిర్మాణాల ను చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన తెలిపారు.

పంచ సూత్రాలపై మహిళలకు శిక్షణ ఇవ్వాలి



సమీక్షలో మాట్లాడుతున్న మెప్మా సంచాలకులు విజయలక్ష్మి

గుంటూరు సిటీ, జనవరి 8: మహిళల ఆర్థిక అభ్యున్నతికి పంచ సూత్రాలు పాటించేలా వారికి శిక్షణ ఇప్పించాలని, ప్రతి మహిళా సంఘం బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని మెప్మా సంచాలకులు వి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం గుంటూరు జడ్పీ మీటింగ్ హాల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్టీఆర్, ప్రకాశం, వెస్ట్‌గోదావరి, ఏలూరు జిల్లాలకు సంబంధించిన మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాలపై ప్రాంతీయ సమీక్ష నిర్వహించారు. జీవనోపాధి మెరుగుపడేలా స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) సభ్యులకు శిక్షణ ఇవ్వాలని విజయలక్ష్మి సూచించారు. పట్టణాలలో మహిళా మార్ట్‌లు, జగనన్న ఈమార్ట్‌లు, పట్టణ ప్రగతియూనిట్‌లు, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు అనేకమైనవి ఏర్పాటుచేయడం జరిగిందని, వాటిని డ్వాక్రా మహిళలే నిర్వహించుకొనేలా శిక్షణను అందించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వెంకటనారాయణ, వెస్ట్ గోదావరి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇమ్మాన్యూయెల్, ప్రకాశం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రవికుమార్, రామాంజనేయులు, సబ్జెక్టు స్పెషలిస్టులు, స్టేట్ మిషన్ మేనేజర్లు, సిటీ మిషన్ మేనేజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పిడుగురాళ్ల, జనవరి 8: పట్టణంలోని క్రోసూరు బస్టాండ్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనంకి గ్రామానికి చెందిన బండారు వాసు (18) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిగత పనుల మీద కోనంకి గ్రామం నుంచి పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ మీదుగా సినిమాహాలు సెంటర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో క్రోసూరు బస్టాండ్ సమీపంలోకి రాగానే మరో రెండు బైకులు పక్కగా వచ్చాయి. వాసు నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన చికిత్సకు గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందు తూ మృతి చెందినట్లు ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణారావు తెలిపారు.

జగన్ నిర్వాకం వల్ల రాష్ట్రం అదోగతి

- మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జనవరి 8: ఓ వ్యక్తి వల్ల ఒక రాష్ట్రం... ఒక తరం... కోట్లాది మంది ప్రజలు ఎంతో నష్టపోతున్న సందర్భం దేశంలో మన రాష్ట్రం తప్ప ఎక్కడా లేదని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావేదిక కూల్చివేతతో పాలన ప్రారంభించిన జగన్ ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్నివిధాల కూల్చివేశాడని తెలిపారు. వ్యవసాయశాఖను నిర్వీర్యం చేశారన్నారు. ఉద్యానవనశాఖ ద్వారా పంట నష్టపోయిన ఏ ఒక్క రైతు కూడా పరిహారం పొందిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో కౌలురైతు ఆత్మహత్యలలో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానం, రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానం, రైతు అప్పుల్లో మొదటిస్థానంకు తెచ్చిన ఘనుడు సీఎం జగన్ అన్నారు. పల్నాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేవు... డ్రిప్ ఇరిగేషన్‌కు రాయితీలే రావడం లేదు... మద్ధతు ధర అందని ద్రాక్షలా ఉందన్నారు. రివర్స్ టెండరింగ్‌ల పేరుతో ఇరిగేషన్ ప్రాజెక్టులను నాశనం చేశాడన్నారు. పట్టిసీమ పెడితే చంద్రబాబుపై కోపంతో దానిని పట్టించుకోవడం మానేశాడన్నారు. పోలవరం కూడా అదే దుస్థితిలో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం దిగేంతవరకు పనులు చేయడం మావల్ల కాదంటూ కాంట్రాక్టర్లు చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు. జాబ్ క్యాలెండర్ లేదు.. డీఎస్సీ లేదు.. వచ్చిన పరిశ్రమలను కూడా భయపెట్టి పక్క రాష్ట్రాలకు పారిపోయేలా చేస్తున్నారన్నారు. నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఐటీ రంగమే లేకుండా చేశారన్నారు. రేపటి ఎన్నికలలో జగన్‌ను ఇంటికి సాగనంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా వున్నారన్నారు. మరో మూడు నెలల్లో అమరావతే ప్రజారాజధానిగా మారనున్నదని యరపతినేని తెలిపారు.

దోపిడీ, సంపాదనే ధ్యేయంగా పాలన

ధూళ్ళిపాళ్ళ నరేంద్ర కుమార్



మాట్లాడుతున్న ధూళ్ళిపాళ్ళ నరేంద్ర కుమార్

సత్తెనపల్లి, జనవరి 8: ముఖ్యమంత్రి జగన్ అధి కా రంలోకి వచ్చాక దోపిడీ, సంపాదనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ధూళ్ళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. సోమవారం సత్తెనపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం కోల్పోతున్నామని తెలిసినా వైసీపీ మంత్రులు, ముఖ్యమంత్రి పెద్దఎత్తున వసూళ్ళకు పాల్పడుతున్నారన్నారు. జగన్ సీఎం కాలేడని, ఆ పార్టీ చిత్తుచిత్తుగా ఓడి పోతుందన్నారు. శవాలపై పేలాలు ఏరుకున్నట్టు పెద్దఎత్తున రాష్ట్రంలో వసూళ్ళకు పాల్పడుతున్నారన్నారు. స్థానిక మంత్రి రైతు సమస్యలపై స్పందించడన్నారు. ఇన్సూరెన్స్ డబ్బుల్లో కమీషన్ కోసం మంత్రి కక్కుర్తి పడ్డారన్నారు. పంట పొలాలకు నీరు ఇవ్వలేని పరిస్థితుల్లో మంత్రి ఉన్నారన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోని మంత్రి అంబటి సంక్రాంతి సంబరాల పేరిట నియోజకవర్గంలో లాటరీ టిక్కెట్లు అమ్మిస్తున్నారన్నారు. పెన్షన్‌దారులకు సైతం లాటరీ టిక్కెట్‌లు అంటగడుతున్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పటం ఖాయన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు తాతా జయప్రకాష్ నారాయణ, మక్కపాటి రామచంద్రరరావు, బండారు నాగరాజు, గుంటూరు ఆశీర్వాదం, అప్పారావు తదితరులు ఉన్నారు.

నేడు పెదకాకాని సమీపంలో

గుంటూరు కారం సినిమా ఆడియో ఫంక్షన్



ఆడియో ఫంక్షన్ నిర్వహణకు సిద్ధమవుతున్న వేదిక

పెదకాకాని, జనవరి 8 : ప్రిన్స్ మహేష్‌బాబు నటించిన గుంటూరు కారం సినిమా ప్రీ ఆడియో రిలీజ్ ఫంక్షన్‌కు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గుంటూరు జిల్లా పెదకాకాని సమీపంలోని నంబూరు అడ్డరోడ్డు వద్ద ఈ సినిమా ప్రీ ఆడియో రిలీజ్ ఫంక్షన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఈ ఫంక్షన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హారిక హాసిన్ బ్యానర్‌పై నిర్మాత రాధాకృష్ణ(చిన్నబాబు), దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సారథ్యంలో సూపర్‌స్టార్ మహేష్ బాబు, అందాల భామ శ్రీలీల హీరోహీరోయిన్లుగా నటించిన గుంటూరు కారం సినిమా ప్రీ రిలీజ్ ఆడియో ఫంక్షన్ పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ఈ సినిమాలో నటించిన మీనాక్షి చౌదరి, రమ్యకృష్ణ, ప్రకాష్‌రాజ్, రావు రమేష్ తదితరులు ఈ వేడుకకు హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

20న రాష్ట్ర జూనియర్ బాలబాలికల క్యారమ్స్ జట్ల ఎంపిక

గుంటూరు(తూర్పు), జనవరి 8: ఆంధ్రా స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విజయవాడ, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 20వ తేదీన రాష్ట్ర జూనియర్ బాలబాలికల క్యారమ్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ ప్రధానకార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు బాలబాలికలు అయితే 2006 తరువాత, యువతీ, యువకులైతే 2003 తరువాత పుట్టినవారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 91774 79119 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నూతన భవన సముదాయానికి రూ.6లక్షల విరాళం



పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దాతలు

గుంటూరు(తూర్పు), జనవరి 8: జేకేసీ రోడ్డులోని కమ్మజనసేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవనసముదాయంలో ఒక గది నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం రూ.6లక్షలను విరాళంగా కీర్తిశేషులు ముప్పాళ్ల సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు ప్రకటించారు. ఈ మేరకు బృందావన్‌గార్డెన్‌లోని బాలికల వసతిగృహంలో సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు ఆయన కుటుంబసభ్యులు కస్తూరి, నిమ్మగడ్డ పద్మజ, విద్యాసాగర్, ఆకాష్ సాయిశ్రీ, శ్రీఅన్వేష్ కలసి చెక్కును అందజేశారు. అనంతరం సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ముప్పాళ్ల సుబ్బారావు కుటుంబసభ్యులు గతంలో ఒక గది నిర్మాణానికి అవసరమైన నిధులు ఇచ్చారని, మరో గదికి విరాళం ఇవ్వడం హర్షణీయమన్నారు. రెండు సంవత్సరాల్లో నూతన భవనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి గోరంట్ల పున్నయ్యచౌదరి, ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు, పాలకవర్గసభ్యులు పెద్ది సాంబశివరావు, వడ్లమూడి శివసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	83, 98, 105
చికెన్ విత్ స్కిన్	170.00
చికెన్ స్కిన్ లెస్	180.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



అర్జీలను స్వీకరిస్తున్న జేసి రాజకుమారి, ఆర్డీవో శ్రీకర్ తదితరులు

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

● జేసీ రాజకుమారి గణియా ● స్పందనకు 236 అర్జీలు
● పరిశీలించి పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ

గుంటూరు,(తూర్పు),జనవరి8: స్పందనలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జేసీ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనకు 236 అర్జీలు అందాయి. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్రరావు, కే.స్వాతి, లక్ష్మీకుమారి, ఆర్డీవో పీ.శ్రీకర్, డ్వామా పీడీ వెంకట శివరామిరెడ్డితో కలసి జేసీ అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ, హౌసింగ్ పీ డీలు హరిహరనాథ్, వేణుగోపాల్, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ, డీఈవో పీ.శైలజ ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రారంభించాలి ...

గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం గతంలో రెండు గ్రామాల రైతులకు అధికారులు డీడీలు అందజేశారని, మిగిలిన ప్రత్తిపాడు, అన్నవర్రు, రాజుపాలెం, పాలపర్రు, వరగాని గ్రామాలకు కూడా రెండు నెలల్లో డీ డీ లు ఇచ్చి నవంబరు నెల లోపల భూసేకరణను పూర్తి చేస్తామని, అధికారులు హామీ ఇచ్చారని కానీ ఇంతవరకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని నల్లమడ రైతు సంఘ నాయకులు కొల్లా రాజమోహన్, యార్లగడ్డ అంకమ్మ చౌదరి స్పందనలో వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కోడ్‌కు ముందే భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసి, పనులను ప్రారంభించాలని కోరారు.

దారిని ఆక్రమించుకుని దుకాణాలు నిర్మిస్తున్నారు..

పాతగుంటూరు, వార్డు నెంబరు4లో శ్మశానం రోడ్డులోని మా స్థలంనకు మునిసిపాలిటీ వారు దారిని ఏర్పాటు చేశారని, కానీ కొంతమంది ఆ మార్గాన్నిఈ రోడ్డును ఆక్రమించుకుని దుకాణాలు, దాబా ఏర్పాటు చేస్తున్నారని పాతగుంటూరుకు చెందిన పుట్ట శ్రీనివాస్‌బాబు స్పందనలో ఫిర్యాదు చేశారు. స్థలం దారిలోనుంచి ఆక్రమణదారులను తొలగించాలని కోరారు.

రోడ్డు విస్తరణ పేరుతో నివాసాలను ఖాళీ చేయిస్తున్నారు ..

ఇన్నర్‌రింగురోడ్డు విస్తరణ పనులు మొదలుపెట్టామని, వారం రోజుల్లో మీ నివాసాలను ఖాళీచేయాలంటూ అధికారులు నోటీసులు ఇస్తున్నారని స్వర్ణభారతి నగర్, మిషన్‌ఫారంకు చెందిన ప్రజలు స్పందనలో వినతిపత్రం అందజేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, అద్దె ఇళ్లలో ఉండండి.. నెలకు రూ.1000 ఇస్తామని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని గంగారామ్, సునిత. స్వర్ణ, మరియమ్మ తదితరులు ఆవేదన వ్యక్తచేశారు.

విశ్రాంత మిలటరీ ఉద్యోగి పొలాన్ని ఆక్రమించుకున్నారు..

విశ్రాంత మిలటరీ ఉద్యోగి అయిన తన తండ్రికి ప్రభుత్వం కాకాని మండలం, తక్కెళ్లపాడు గ్రామంలో సర్వే నెంబరు 348/2లో 2.50 ఎకరాలు డీ-ఫారం శాశ్వతపట్టా భూమిని ఇచ్చిందని, ఇటీవల తన తండ్రి చనిపోయాడని ఆయన కుమారుడు షేక్ మహమద్ రఫీ తెలిపారు. అయితే స్థానిక అధికారులతో కలిసి కృష్ణాజిల్లాకు చెందిన జంగా వేములక్ష్మీ అనే మహిళ ఆ భూమిని ఆక్రమించుకుందని స్పందనలో ఫిర్యాదుచేశారు.

న్యూరో ఫిజియోథెరపీ పోస్టులను భర్తీ చేయాలి

జీజీహెచ్‌లో ఖాళీగా ఉన్న న్యూరో ఫిజియోథెరఫీ పోస్టులను భర్తీ చేయాలని స్థానిక విద్యానగర్‌కు చెందిన బీఎస్సీ న్యూరో ఫిజియోదెరఫీ పఠాన్ షబీహా స్పందనలో ఫిర్యాదు చేశారు. ఇతర జిల్లాలో ఈ పోస్టులు భర్తీ పక్రియ 2022లో పూర్తి అయ్యిందని, కానీ జీ జీ హెచ్‌లో ఈ నియామకాలు ఇంతవరకు చేపట్టలేదని గుర్తుచేశారు.

కమ్యూనిటీ భవనం స్థలాన్ని ఆక్రమించుకున్నారు

కొల్లిపర మండలం, కొల్లిపర గ్రామంలో గతంలో టీడీపీ ప్రభుత్వం రజకులకు కమ్యూనిటీ భవనం కోసం 12 సెంట్లు కేటాయించిందని, కానీ ఈమధ్య కొందరు వ్యక్తులు ఆస్థలాన్ని ఆక్రమించుకున్నారని అదే గ్రామానికి చెందిన రంపాటి వెంకటేశ్వరరావు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఆ స్థలాన్ని రజకులకు ఇవ్వాలని ఉన్నాతాధికారులు ఆదేశాలు జారీచేసినా స్థానిక అధికారులు ఈ ఆదేశాలను అమలుచేయడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.



జెండా ఊపి జయహో బీసీ ప్రచార రథాలను ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

జగన్ పాలనలో అధికంగా నష్టపోయింది బీసీలే ..

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డి పాలనలో అత్యధికంగా నష్టపోయింది బీసీలేనని, బీసీలు ఆర్థికాభివృద్ధికి తోడ్పడే కార్పొరేషన్‌ను జగన్‌నిర్వీర్యం చేసాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో జయహో బీసీ ప్రచార రథాలను శ్రావణ్ కుమార్‌తో పాటు గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, ప్రత్తిపాడు ఇన్‌చార్జి బూర్ల రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీడీపీ బీసీ నాయకులు నిమ్మల శేషయ్య తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జయహో బీసీ కార్యక్రమానికి ప్రచార రథాలను అందించిన నిమ్మల శేషయ్య, మల్లెల ఈశ్వరరావులకు ధన్యవాదములు తెలిపారు. జయహో బీసీ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించి టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు జరగబోయే మేలును వివరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మద్దిరాల గంగాధర్, కంచర్ల శివరామయ్య, ఉప్పుటూరి పేరయ్య, అడక శ్రీనివాసరావు, మాదల చిన్న కొండలరావు, వంగర ఏడుకొండలు, బొబ్బిలి రామారావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులతోఉపాధ్యాయులు

ఐఎన్‌టిఎస్‌వో ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య)జనవరి 8: జాతీయ స్థాయిలో ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్(ఐఎన్‌టిఎస్‌వో) ఫలితాల్లో లక్ష్మీపురంలోని శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలో రెండోస్థాయికి మొత్తం 333 మంది విద్యార్థులు అర్హతసాధించారన్నారు. ఇందులో ఏటీఎస్‌వో 17 మంది, ఇటీఎస్‌వోలో 108, జీటీఎస్‌వోలో 92 మంది, ఎంటీఎస్‌వోలో 81 మంది, ఎస్‌టీఎస్‌వోలో 35 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం వినీత, కోఆర్డినేటర్ మూర్తి,డీన్ హరిబాబు, ఎవో శ్రీనివాసరావు,ఐఎస్ఎస్‌టివో ఇన్‌చార్జ్ నర్మద అభినందించారు.

ఎస్మాతో అదరం.. బెదరం



కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలలో పాల్గొన్న అంగన్‌వాడీలు

● దీక్ష శిబిరంలో అంగన్‌వాడీ యూనియన్‌నేతలు
● 28వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె
● ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు

గుంటూరు(తూర్పు), జనవరి8: ఎస్మా చట్టంతో ఆదరం, బెదరమని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 28 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పుడు ఎస్మాతో బెదిరింపులకు దిగడం దారుణమన్నారు. కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న సమ్మెలో భాగంగా సోమవారం నుంచి ప్రారంభమైన రిలే నిరహారదీక్షలలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు. దీక్షలకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజుఫర్ అహమద్, జిల్లా నేతలు వై.నేతాజీ, కే.శ్రీనివాసరావు, నళినికాంత్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేష్, గౌరవ అధ్యక్షుడె రాధాకృష్ణమూర్తి పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా (సీఐటీయూ) నాయకులు నగర కార్యదర్శి టి.రాధ, దీప్తి మనోజలు మాట్లాడుతూ రీలే దీక్షలలో సమస్య పరిష్కరించకపోతే అమరదీక్షలకు దిగుతామని హెచ్చరించారు. నిరసనల్లో అంగన్‌వాడీలు నాగమణి, రమాదేవి, కుమారి, రోజమ్మ, మస్తానీ, పంకజాక్షి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ తీసుకువచ్చిన జీవో 2ను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎస్మా చట్టానికి వ్యతిరేకంగా మంగళవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మార్కెట్ సెంటర్ నుంచి శంకర విలాస్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయా సంఘాల నేతలు తెలిపారు. ఈ ర్యాలీలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కార్మికులకు అండగా టీడీపీ-జనసేన

● జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 8: పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఒప్పంద ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటానికి జనసేన, టీడీపీలు వెన్నుదన్నుగా నిలుస్తాయని జిల్లా జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె 13 వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో సోమవారం నగరపాలక సంస్థ నుంచి కలక్టరేట్ వరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కార్మిక సంఘాలకు మద్దతుగా జనసేన టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చమంటే సీఎం జగన్‌రెడ్డి శివాలెత్తిపోతున్నాడని మండిపడ్డారు. కార్మిక సంఘ జేఏసీ సభ్యుడు సోమి శంకర రావు మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర సమయంలో సైతం ప్రాణాలకు తెగించి పోరాడిన పారిశుధ్య కార్మికులపై ప్రభుత్వం చిన్న చూపు చూడటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో రెల్లి యువనేత సోమి ఉదయ్ కుమార్ , జనసేన నేతలు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు నారా జోషి తదితరులు పాల్గొన్నారు.



లాలాపేట ఎస్ఐ అంజయ్య కాళ్లపై పడి వేడుకుంటున్న కార్మిక సంఘాల నేతలు

దివ్యాంగుల ఆశ్రమాన్ని అభివృద్ధి చేద్దాం

● జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి


గుంటూరు(కార్పొరేషన్), జనవరి 8 : గుంటూరులో గోరంట్ల వద్ద గల కార్మెల్ సేవా సదన్ మానసిక వికలాంగుల ఆశ్రమాన్ని అభివృద్ధికి చేయూతనిద్దామని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి తెలిపారు. సోమవారం మానవత బృందంతో కలసి ఆయన కార్మెల్ సేవాసదన్ ఆశ్రమాన్ని సందర్శించి, ఆశ్రమ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా శర్వాణి రెడీ మిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గోపాల్ రెడ్డి ఆశ్రమ ప్రహరీ నిర్మాణానికి కావలసిన కాంక్రీట్‌ను ఉచితంగా అందిస్తానని ప్రకటించారు. వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ.. ఆశ్రమంలో ఉంటున్న 70 మంది దివ్యాంగులను దశాబ్ద కాలంగా ఆదుకుంటున్న కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు డాక్టర్ జాక్ క్లమాకస్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మానవతా, రోటరీ క్లబ్ దీక్షిత ఫౌండేషన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.



కేఎల్పీలో కోలాట వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయినులు

కేఎల్పీలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

గుంటూరు(విద్య)జనవరి 8: స్థానిక కేఎల్పీ స్కూల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొమ్మల కొలువు, భోగిమంటలు, రంగవల్లులు, పతంగులతో విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వైరధినిచౌదరి, ఏవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

సుమేధాలో సంక్రాంతి సంబరాలు

గుంటూరు(విద్య)జనవరి 8: విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే ఉమ్మడి కుటుంబ విలువల్ని తెలియజేయడానికి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు సుమేధా స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఎన్జీవోకాలనీలోని పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బొమ్మల కొలువు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దు విన్యాసాలతో పాఠశాలలో వేడుకలు నిర్వహించారు.



విద్యార్థినుల సాంస్కృతిక వేడుకలు

అభ్యుదయలో ఘనంగా సంక్రాంతి..

గుంటూరు(విద్య)జనవరి 8: స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ డిగ్రీ కళాశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగోలి వేడుకల్లో పాల్గొన్నారు. పండుగ విశిష్టత తెలియజేస్తూ బోగిమంటలు వేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఇంజనీరింగ్ కార్మికులకు మొండి చేయి

● మునిసిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మధు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 8: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపడుతున్న సమ్మెలో భాగంగా సోమవారం ది ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మునిసిపల్ ఇంజనీరింగ్- టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నగరపాలక సంస్థ కమిటీ సభ్యులు సమ్మెలో పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మధు మాట్లాడుతూ ఇప్పటికి ప్రభుత్వం మూడు దఫాలుగా కార్మికులతో చర్చలు జరిపి వరగబెట్టింది ఏమీ లేదని, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత చర్చల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్పొరేషన్లలో, మున్సిపాలిటీలలో ఇంజనీరింగ్ విభాగంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎంపీహెచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న 15,000 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచే పరిస్థితి లేదని, అసలు దాని గురించి ప్రస్తావనే తేవద్దని, ఆ విషయాన్ని అడిగితే మీరు బయటికి వెళ్లాలని మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడటం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నగర కమిటీ ఉపాధ్యక్షుడు ప్రేమ్ చందు, ఏసుబాబు, సంయుక్త కార్యదర్శి వేపూరి రవిశంకర్, నరేష్ నాయక్, ట్రెజరర్ నాగిపోకు సుమన్ సభ్యులలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పేదలకు ప్రెషర్ కుక్కర్లు పంపిణీ

● వెయ్యి కుటుంబాలకు అందజేసిన టీడీపీ నేత మన్నవ మోహనకృష్ణ



ప్రెషర్ కుక్కర్లు పంపిణీ చేస్తున్న మన్నవ

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పశ్చిమనియోజకవర్గంలోని 1000 పేద కుటుంబాలకు సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ప్రెషర్ కుక్కర్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నులు, అధిక ధరలు, ఉపాధి లేమితో జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు ఇక్కట్ల పాలయ్యారని, నాలుగున్నరేళ్లలో మధ్య తరగతి ప్రజలు పేదలుగా, పేదలు నిరుపేదలుగా మారిపోయారని విమర్శించారు. తమకు గొప్పగా మేలు చేసి ఉద్ధరిస్తాడని ఓట్లేసిన ప్రజలకు నాలుగున్నరేళ్లలో జగన్ నరకం చూపించాడని అన్నారు. ఈపరిస్థితిని అధిగమించడంకోసం నియోజకవర్గ పరిధిలోని పేదకుటుం బాలకు మన్నవ మోహనకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా గత ఐదేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజల సంక్షేమం సాధ్యమని మన్నవ స్పష్టం చేశారు.

రౌడీషీట్ తెరుస్తామని బెదిరిస్తున్నారు

● ప్రత్తిపాడు రెవెన్యూ అధికారులు, పోలీసులపై ఎస్పీకి ఫిర్యాదు
● గ్రీవెన్స్‌లో బాధితులు నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

గుంటూరు ,జనవరి 8 : ప్రత్తిపాడులో రెవెన్యూ అధికారులు, పోలీసులతో కలిసి అధికార పార్టీ నేతలు చేస్తున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నించినందుకు తనపై తప్పుడు కేసులు పెట్టి వేధించడమే కాకుండా తనపై రౌడీషీట్ తెరుస్తామని బెదిరిస్తున్నారని ప్రత్తిపాడుకు చెందిన కమ్మ సాంబశివరావు అనేవ్యక్తి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా తన పరిధిలో పరిష్కారమయ్యే ఫిర్యాదులకు తక్షణ పరిష్కార మార్గం చూపి మిగిలిన ఫిర్యాదులు సంబంధిత పోలీసు స్టేషన్ల పరిధిలోని అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు.

నడిరోడ్డుపై తన చేయి పట్టుకొని అసభ్యకరంగా ప్రవర్తించడమే గాక అదేమని ప్రశ్నించినందుకు తనపై, తన కుటుంబ సభ్యులపై ఎస్సీ ఎస్టీ కేసు బనయించారని గుంటూరునగరంలోని ఏటుకూరు రోడ్డులోని దర్గా మాన్యంకు చెందిన ఓ బాధిత యువతి ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు.

నరసరావుపేట పరిధిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుదర్శన్‌రావు తనను లైంగిక వేధించడమేగాక బెదిరింపులకు పాల్పడుతున్నాడని పాత గుంటూరులోని లక్ష్మీనగర్ ఏడవ లైనుకు చెందిన బాధిత యువతి ఫిర్యాదు చేసింది. తనకోరిక తీర్చుకుంటే చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మూడు కోట్ల పైగా చిట్టీల సొమ్ము కాజేయడమే గాక వడ్డీకి డబ్బులు తీసుకొని ఎగ్గొట్టి వేధింపులకు పాల్పడుతున్న కొప్పురావుకు చెందిన కామినేని మాధవి, శ్రీనివాసరావు దంపతులపై తగు చర్యలు తీసుకోవాలని బాధితులు వేడుకున్నారు. ఈ మేరకు పెద్ద సంఖ్యలో బాధితులు పోలీస్ కార్యాలయానికి వచ్చి ఎస్పీకి తమ ఆవేదనను వెల్లడించారు.

హైకోర్టులో తన కుమారుడికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని విడతల వారీగా తన నుంచి మేడికొండూరుకు చెందిన సయ్యద్ మీరా షరీఫ్ రూ.54లక్షలు తీసుకొని మోసం చేశాడని ఫిరంగిపురం మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన షేక్ పెద్ద ఘన్ సైదా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమ డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నాడని బాధితులు వాపోయారు.

తాము స్వీడన్‌లో ఉంటూ అక్కడ నుంచి పంపిన రూ.కోటి డబ్బు తన పుట్టింటివారు తీసుకొని తనకివ్వకుండా మోసంచేశారని పెదకాకానికి చెందిన ఇమడాబత్తిని జయలక్ష్మి అనే వివాహిత ఫిర్యాదుచేశారు. డబ్బులు అడుగుతుంటే తన తండ్రి తమను చంపేస్తామని బెదిరిస్తున్నాడని వాపోయారు.



దాడులు.. తనిఖీలు.. కేసులు

● 2023 అంతటా కొరఢా ఝళిపించిన ఆర్‌పీఎఫ్

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే రక్షక దళం (ఆర్‌పీ ఎఫ్) గత ఏడాది అంతా విస్తృతంగా దాడులు, తనిఖీలు నిర్వహించి పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేసింది. వందల సంఖ్యలో నేరస్థు లను అరెస్టు చేసి జైళ్లకు పంపించింది. రూ.కోట్ల విలువ చేస్తే రైల్వే ఆస్తులను రికవరీ చేసింది. ఆదివారం 2023 సంవత్సరం నివేదికని ఆర్‌పీఎఫ్ విడుదల చేసింది. మిషన్ రైల్ సురక్ష కింద రైల్వే ఆస్తుల ను చోరీ చేసిన 70 మంది క్రిమినల్స్, 12 మంది రిసీవర్లను పట్టు కుని రూ.90 లక్షల 91 వేల 547 విలువ చేసే సొత్తుని రికవరీ చేసిం ది. రైల్వే చట్టం కింద 3,486 కేసులు నమోదు చేసి 3,444 మందిని అరెస్టు చేసింది. వారిలో 3,561 మందికి శిక్ష పడిందని, ఫైన్ రూపం లో రూ.9.14 లక్షలు వసూలు చేసినట్లు పేర్కొన్నది. ఆపరేషన్ ఉప లబ్ద్ కింద 15 మంది దళారులను అరెస్టు చేసి 42 లైవ్ టిక్కెట్‌లు రూ.53,345 విలువ చేసేవి సీజ్ చేసింది. 72 పర్సనల్ యూజర్ ఐడీలను ఈ సందర్భంగా బ్లాక్ చేశారు. మిషన్ యాత్రీ సురక్ష కింద 71 చోరీ కేసుల్లో 32 మంది క్రిమినల్స్‌ని అరెస్టు చేసి రూ.26 లక్షల 97 వేల 500 విలువ చేసే సొత్తుని రికవరీ చేసింది. ఆపరేషన్ సం రక్ష కింద ఎవరైతే రైళ్లపై రాళ్లు రువ్వారో 20 కేసులు నమోదు చేసి 48 మంది నిందితులను అరెస్టు చేసింది. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఎవరైతే రైళ్లలో పేలుడు పదార్థాలు తీసుకెళుతున్నారో వారిని అరెస్టు చేసింది. మిషన్ మహిళ సురక్ష ద్వారా 2,149 రైళ్లలో 3,168 మంది మహిళ ప్రయాణికులతో మాట్లాడి ఒంటరిగా ప్రయాణిస్తున్న వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది. ఆపరేషన్ నతారక్ కింద 1,744 మద్యం సీసాలను రికవరీ చేసింది. దీనికి సంబంధించి 29 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నది.

దిక్సూచి DIKSUCHI

బంధుత్వం(కిన్‌షిప్)

సంస్థ అంటే ఒక క్రమపూర్వకమైన సామాజిక సంబంధాల వ్యవస్థ. సామాజిక ప్రమాణాలు, విలువలపై ఆధారపడిన అవ్యవస్థీకృతమైన సమూహమే సామాజిక సంస్థ. ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి ఒక తరం నుంచి మరో తరం వరకు జాగ్రత్తగా కొనసాగే ప్రామాణిక వ్యవస్థే సామాజిక సంస్థ. ప్రతి సమాజంలోనూ ప్రాథమికంగా ఉండేవి బంధుత్వం, వివాహం, కుటుంబం, మతం, విద్య, ఆర్థిక, రాజకీయ సంస్థలు.

బంధుత్వం ఒక సామాజిక సంస్థ

ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రత్యేకం

ఇండియన్ సొసైటీ



బంధుత్వం: సమాజంలో మానవుడు ఒంటరిగా జీవించలేడు. జన్మించింది మొదలుకొని మరణించే వరకు వ్యక్తి అనేక మందితో సంబంధాన్ని కలిగి ఉంటాడు. సమాజంలో ఉన్న వ్యక్తుల మధ్య ఏదో ఒక రకమైన సంబంధం కొనసాగుతూ ఉంటుంది. అయితే రక్తం లేదా వివాహం ఆధారంగా ఏర్పడే బంధాలు దగ్గరగా ఉంటాయి.

రక్త బంధుత్వం: భార్య, భర్త ఇద్దరికీ, వారి సంతానానికి మధ్య ఏర్పడిన పరస్పర బంధాలను 'రక్త బంధుత్వం' అని పిలుస్తారు. ఒకే దంపతులకు పుట్టిన బిడ్డలందరి మధ్య రక్త సంబంధం ఉంటుంది. ఈ సంబంధాన్ని తెలిపేదే 'ఏక రక్త సంబంధం'.

బంధుత్వాలను భిన్న సమాజాలలో భిన్న రీతులుగా అనుసరిస్తున్నారు. ఉదాహరణకు తమిళనాడులోని నీలగిరి కొండల్లో నివశిస్తున్న 'తోడా' సమాజంలో స్త్రీ ఒక వ్యక్తితో సంతానం కలిగి...తదనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకుంటే అతడినే ఆ స్త్రీ పూర్వ సంతానికి కూడా తండ్రిగా అక్కడి సమాజం గుర్తిస్తుంది. ఈ తరహా బంధుత్వాన్ని సామాజిక బంధుత్వం(సోషియాలజికల్ కిన్‌షిప్) అంటారు. సామాజిక బంధుత్వాన్ని మాత్రమే 'వాస్తవ బందుత్వం' అంటారు. ఇటువంటి వాస్తవ బంధుత్వాన్ని బట్టి కూడిన వారిని బంధువులు(కిన్స్) అంటారు.

ద్వితీయ బంధువులు: ఒక వ్యక్తికి సంబంధించిన ప్రాథమిక బంధువులకు చెందిన ప్రాథమిక బంధువులు, ఆ వ్యక్తికి ద్వితీయ బంధువులు అవుతారు.(భార్య ప్రాథమిక బంధువు, ఆవిడ తల్లిదండ్రులు-సోదర, సోదరీమణులు ద్వితీయ బంధువులు)

తృతీయ బంధువులు: ఒక వ్యక్తి ద్వితీయ బంధువులకు చెందిన ప్రాథమిక బంధువులు... ఆ వ్యక్తికి తృతీయ బంధువులు అవుతారు.

ఉదా:- భార్య తాలూకు బావ(తోడల్లుడు తృతీయ బంధువు అవుతాడు. మొదటి వ్యక్తి తాలూకు భార్య ప్రాథమిక బంధువు, ఆవిడ అక్క ద్వితీయ బంధువు, అక్క భర్త తృతీయ బంధువు)

వర్గాత్మక వ్యవస్థ: వర్గాత్మక వ్యవస్థలో వివిధ సంబంధీకులు అందరినీ ఒకే వర్గంలో చేర్చడంతోపాటు ఒకే పదంతో వారిని సంబోధిస్తారు. ఉదా:- మామ ఒక వర్గాత్మక పదం.

వర్గాత్మక వ్యవస్థలో బంధువులను సంబోధించే పద్ధతులను బట్టి బంధుత్వ పదాలను మూడు రకాలుగా పేర్కొనవచ్చు. అవి.. పదాలు, అన్వయ పదాలు, టెక్నానమీ.

ఎ) సంబోధన పదాలు: ఒక వ్యక్తి తన బంధువులతో సంభాషించేటప్పుడు వాడే పదాలు 'సంబోధన' పదాలు.

ఉదాహరణలు:-

1. ఒక వ్యక్తి తన చెల్లెలితో సంభాషించేటప్పుడు 'సోదరి' అని వాడుతారు.
2. ఒక వ్యక్తి తన తండ్రితో సంభాషించేటప్పుడు 'నాన్న' అని వాడతారు.

బి) అన్వయ పదాలు: ఒక వ్యక్తి మూడో వ్యక్తితో ఒకానొక తన బంధువు గురించి చెప్పేటప్పుడు ఉపయోగించే బంధుత్వ పదమే 'అన్వయ పదం'. ఉదాహరణకు ఒక వ్యక్తి తన నాన్న సోదరుని గురించి మూడో వ్యక్తికి చెప్పినప్పుడు మా 'చిన్నాన్న' అని వర్ణిస్తాడు. అంటే 'చిన్నాన్న' అన్వయ పదం.


వివరణాత్మక పదాలు: రెండు లేదా అంతకన్నా ఎక్కువ ప్రాథమిక పదాలు కలిసినందు వల్ల ఒక కొత్త పదం ఏర్పడినప్పుడు దానిని వివరణాత్మక పదం అంటారు. ఉదాహరణకు నాన్న+అమ్మ=నాన్నమ్మ.

బంధుత్వం ఆచరణలు(కిన్‌షిప్ యూసేజెస్): బంధు సమూహాలలో వ్యక్తుల మధ్య వివిధ రకాలైన బంధుత్వాలు ఉంటాయి. ఒక్కో రకమైన బంధుత్వం ఒక్కో రకమైన ప్రవర్తనను తెలియజేస్తుంది. సమాజం మొతమ్మీద చూస్తే... బంధు సమూహాలలోని వ్యక్తుల మధ్య కొన్ని నిర్దిష్టమైన ప్రవర్తనలు కనిపిస్తాయి. వాటినే బంధుత్వ ఆచరణలు అంటారు. వాటిలో ఆరు ప్రధానమైనవి. అవి... పరిహాస సంబంధాలు, వైదొలుగు నడవడి, మాతులాధికారం, పితృష్వాధికారం, సాంకేతిక సంబోధన, కుహనా ప్రసూతి.



జి.వీరా స్వామి,
సీనియర్ ఫ్యాకల్టీ.

సైన్స్‌లో పీహెచ్‌డీకి జెస్ట్



సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రెన్స్ స్ర్కీనింగ్ టెస్ట్(జెస్ట్) 2024 నోటిఫికేషన్ వెలువడింది. తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ) దీనిని నిర్వహిస్తోంది. ఈ స్కోర్ వ్యాలిడిటీ ఏడాది. ఇందులో ఏఆర్ఐఈఎస్, బోస్ ఇన్‌స్టిట్యూట్, హెచ్‌బీఎన్ఐ, హెచ్‌ఆర్ఐ, ఐసీటీఎస్, ఐజీసీఏఆర్, ఐఐఏ, ఐఐఎస్సీ, ఐసర్ సంస్థలు, ఐఐఎస్‌టీ, ఐఎంఎస్సీ, ఐఓపీ, ఐపీఆర్, ఐయూసీఏఏ, జేఎన్‌సీఏఎస్ఆర్, ఎన్‌బీఆర్‌సీ, నైసర్, ఎన్‌సీఆర్ఏ - టీఐఎఫ్ఆర్, పీఆర్ఎల్, ఆర్ఆర్‌సీఏటీ, ఆర్ఆర్ఐ, ఎస్ఐఎన్‌పీ, ఎస్ఎన్‌బీఎన్‌సీబీఎస్, టీఐఎఫ్ఆర్-టీసీఐఎస్, టీఐఎఫ్ఆర్, యూజీసీ-డీఏఈ సీఎస్ఆర్, వీఈసీసీ వంటి ప్రధాన సంస్థలు పాల్గొంటున్నాయి. జెస్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా ఈ సంస్థల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వీటిలో కొన్ని సంస్థలు అందిస్తున్న ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు. ప్రతి సంస్థకూ నిర్దేశిత అర్హత నిబంధనలు ఉన్నాయి. వాటి వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లలో చూడవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఫిజిక్స్, థియరిటికల్ కంప్యూటర్ సైన్స్, న్యూరోసైన్స్, కంప్యూటేషనల్ బయాలజీ.

అర్హత: పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్/ఆస్ట్రానమీ/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/బయోఫిజిక్స్/బయోకెమిస్ట్రీ/ కెమిస్ట్రీ/కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఎంటెక్-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/రేడియో ఫిజిక్స్/మేథమెటిక్స్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ/పోస్ట్ బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్/బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు, ఎంసీఏ అభ్యర్థులకు కూడా కొన్ని సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థులూ అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఆసక్తిగలవారు ఎన్నిసార్లయినా ఈ పరీక్ష రాయవచ్చు.

జెస్ట్ 2024 వివరాలు: ఈ పరీక్షని ఫిజిక్స్, థియరిటికల్ కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒక విభాగంలో మాత్రమే పరీక్ష రాయాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం 3 గంటలు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో 15 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి మూడు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో 10 ప్రశ్నలు ఇస్తారు. ఆప్షన్స్ ఇవ్వరు. వీటికి ఒక నెంబరు సమాధానంగా ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. ఈ ప్రశ్నలకు రుణాత్మక మార్కులు లేవు. మూడో పార్ట్‌లో 25 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం తప్పుగా గుర్తిస్తే మూడోవంతు మార్కు కోత విధిస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లాక్/బ్లూ పెన్‌తో గుర్తించాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 24
- **జెస్ట్ 2024 తేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** jest.org.in

హైదరాబాద్ నిక్మర్‌లో పీజీ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్(నిక్మర్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఫుల్ టైం ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్‌లు. ఏడాది, రెండేళ్ల వ్యవధి గల ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ (పీజీ ఎన్‌క్యాట్) 2024, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, రేట్ ఆఫ్ అప్లికేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నిర్దేశిత డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి ప్రోగ్రామ్‌లో పది శాతం అభ్యర్థులకు నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ అడ్వాన్స్‌డ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ హెల్త్, సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో రెగ్యులర్ డిగ్రీ(ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/అగ్రికల్చర్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ(ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/కామర్స్/ఫైనాన్స్/బ్యాంకింగ్/ మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ఎన్‌క్యాట్ 2024: పరీక్షని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. దీనికి 180 మార్కులు నిర్దేశించారు. ఇందులో క్వాంటిటేటివ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ నుంచి 72 మార్కులకు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 36 మార్కులకు, వెర్బల్ అండ్ జనరల్ ఎబిలిటీ నుంచి 72 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

- గ్రూప్ డిస్కషన్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 మార్కులు, రేటింగ్ ఆఫ్ అప్లికేషన్‌కు 70 మార్కులు ప్రత్యేకించారు.
- సీయూఈటీ(పీజీ)/క్యాట్/మ్యాట్/ఎక్స్‌ఏటీ/ఎన్‌మ్యాట్/ఏటీఎంఏ స్కోర్ ఉన్నవారు పీజీ ఎన్‌క్యాట్ 2024 రాయనవసరం లేదు.
- పీజీ ఎన్‌క్యాట్ 2024 స్కోర్‌కు 60 శాతం; గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల స్కోర్లకు 16.67 శాతం; రేటింగ్ ఆఫ్ అప్లికేషన్‌కు 23.33 శాతం వెయిటేజీ ఇస్తారు.

★ **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
★ **వెబ్‌సైట్:** nicmar.ac.in/hyderabad

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KLKVIU1లో చదవండి.

జాబ్ కార్నర్

టీహెచ్‌డీసీలో అప్రెంటిస్‌లు

రిషికేశ్ (ఉత్తరాఖండ్)లోని టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్... అప్రెంటిస్‌షిప్‌లో శిక్షణకు స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు 80

పోస్టు: ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్

ట్రేడులు: కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్/సెక్రటేరియల్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్.

అర్హత: 10వ తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 24

వెబ్‌సైట్: https://thdc.co.in/

మద్రాస్ ఐఐటి, డేకిన్ వర్సిటీ ఉమ్మడిగా రీసెర్చ్ అకాడమీ

మద్రాస్ ఐఐటీ, ఆస్ట్రేలియాకు చెందిన డేకిన్ యూనివర్సిటీ కలిసి ఉమ్మడిగా రీసెర్చ్ అకాడమీని ఆరంభించాయి. 'ఐఐటీ మద్రాస్ డేకిన్ యూనివర్సిటీ రీసెర్చ్ అకాడమీ'గా మలిచారు. ఉమ్మడి పర్యవేక్షణ, మెరిటోరియస్ స్కాలర్‌షిప్స్‌తో గ్లోబల్ రీసెర్చ్‌కు శ్రీకారం చుట్టారు. సార్క్ అలాగే ఆసియన్ దేశాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్లు - ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే దిశగా పరిశోధనలు చేస్తారని మద్రాస్ ఐఐటీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. క్లీన్ ఎనర్జీ, క్రిటికల్ టెక్నాలజీస్, క్లయిమేట్ చేంజ్, హెల్త్‌కేర్ టెక్నాలజీస్ తదితరాలకు ప్రాధాన్యం ఇస్తారు. రెండు విశిష్ట సంస్థలు ఉమ్మడిగా నాలుగేళ్ళ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తాయి. ఇందులో భాగంగా ముప్పయ్ స్కాలర్‌షిప్‌లను అందిస్తారు. తమ పరిశోధకులకు ఇచ్చేందుకు డేకిన్ వర్సిటీ పది, ఐఐటీ మద్రాస్ ఇరవై స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేశాయి.

వెబ్‌సైట్స్: https:// www.iitm.ac.in/ www.deakin.edu.au/

నవ్య | చిత్రజ్యోతి

తాట తీస్తా..



'నేను కష్టపడి ఈ స్థాయికి వచ్చాననేమో.. ప్రతి ఏడాది సంక్రాంతి వస్తే చాలు.. ఏదో ఒక వివాదాన్ని లేవనెత్తుతూ నాపై ట్రోల్స్ చేయడం కొన్ని వెబ్‌సైట్స్‌కి పరిపాటైపోయింది. ఏడెనిమిదేళ్ల నుంచి ఇదే తంతు. నిన్నటి 'హను-మాన్' ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో చిరంజీగారు ఈ థియేటర్ల వ్యవహారంపై ఎంతో పాజిటీవ్‌గా మాట్లాడారు. 'సమస్యను ఎలా పరిష్కరించాలో దిల్‌రాజుకి తెలుసు.. ఈ విషయాల్లో తనకు అనుభవం ఉంది' అంటూ నా గురించి కూడా గౌరవంగా స్పందించారు. ఆ మాటల్ని వేరే విధంగా మార్చి రెండు ప్రముఖ వెబ్‌సైట్లు పిచ్చి రాతాలు రాశాయ్. మీ వెబ్‌సైట్ రేటింగ్ పెంచుకోవటానికి వేరే వాళ్లను ఎందుకు బలి చేస్తున్నారు? అంటే దిల్ రాజు ఏం రియాక్టవ్వడు, సర్దుకుని పోతాడు అనుకుంటున్నారా? తాట తీస్తా..' అంటూ ప్రముఖ నిర్మాత దిల్ రాజు హెచ్చరిక జారీ చేశారు. తన గురించి అవాస్తవాలు రాశారంటూ.. రెండు వెబ్‌సైట్లపై(ఆంధ్రజ్యోతి కాదు) దిల్‌రాజు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. వెన్నెల కిశోర్, అనన్య నాగళ్ల జంటగా రూపొందుతోన్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్స్'. రచయిత గోపీ మోహన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వి.రమణారెడ్డి నిర్మాత. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని సోమవారం హైదరాబాద్‌లో దిల్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిల్ రాజు మాట్లాడారు. 'చాలా రోజులుగా ఓపిక పడుతూ వచ్చాను. నా వల్ల ఇబ్బంది పడుతున్నట్టు ఏ ప్రొడ్యూసరైనా మీకు చెప్పాడా? దమ్మంటే ఆ ప్రొడ్యూసర్‌నీ నన్నూ ఒక వేదికపై కూర్చోబెట్టి ప్రశ్నించండి. వ్యాపారపరంగా వచ్చే సమస్యల్ని అడ్వాంటేజ్‌గా తీసుకొని నన్ను బ్లేమ్ చేయడానికి వెబ్‌సైట్లనీ, యూట్యూబ్ ఛానల్స్‌ని కొందరు వాడుకుంటున్నారు. సంక్రాంతి రిలీజ్‌ల గురించి ఛాంబర్‌లో మీటింగ్ పెట్టాం. థియేటర్ల కొరత రాకూడదని నిర్మాతను రిక్వెస్ట్ చేసి రవితేజగారి సినిమాను సంక్రాంతి నుంచి పక్కకు జరిపాం. ఇది ఎంత కష్టమైన పనో తెలుసా?.. ఇంకోడెవడో రాశాడు. 'దిల్ రాజు తమిళ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నాడు' అని. ఎవడు చెప్పాడ్రా.. నేను రిలీజ్ చేస్తున్నానని? నీ దగ్గర రుజువు ఉందా? ఆ తమిళ సినిమా రిలీజ్‌ను వాయిదా వేయించిందే నేను. విషయం తెలియకుండా అబద్ధాలు ఎందుకు రాస్తారు? మళ్లీ చెబుతున్నా.. తేలిగ్గా తీసుకోకండి.. ఇక నుంచి నా గురించి అబద్ధాలు రాసి, కాంట్రవర్సీలు క్రియేట్ చేస్తే ఊరుకోను., తాటతీస్తా..' అంటూ ఉద్వేగంగా స్పందించారు దిల్‌రాజు.


'నా సామిరంగ' మరో 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' అవుతుంది



కీరవాణి

'నాగార్జునకు సరిగ్గా సరిపోయే టైటిల్ 'నా సామిరంగ. 32ఏళ్ల క్రితం నాగార్జునతో నేను చేసిన 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' ఎంతటి విజయాన్ని సాధించిందో.. సంక్రాంతికి రానున్న 'నా సామిరంగ కూడా అంతటి విజయాన్ని సాధిస్తుందని నా నమ్మకం. 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' పల్లెటూరి నేపథ్యంతో కూడిన వినోదాత్మక చిత్రం. 'నా సామిరంగ కూడా సేమ్ టు సేమ్. కాబట్టి ఇది మరో 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' అవుతుందని ఆశిస్తున్నా.' అని ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి అన్నారు. అక్కినేని నాగార్జున హీరోగా విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన చిత్రం 'నా సామిరంగ. కీరవాణి స్వరాలందించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా కీరవాణి విలేకరులతో మాట్లాడారు. ' రీరికార్డింగ్ సమయంలో ఓ సందర్భం పాట రాయాలనే ఆలోచనకు దోహదం చేసింది. దాంతో ఇందులో ఓ పాట రాశాను. ఈ సినిమాలో సంగీతం స్వచ్ఛంగా ఉంటుంది. క్వాలిటీ తగ్గకుండా వేగంగా సినిమా తీయగలగడం దర్శకుడు విజయ్ బిన్నీ ప్రత్యేకత. అతను స్వతహాగా డాన్స్ మాస్టర్. కాబట్టి డాన్స్‌ను దృష్టిలో పెట్టుకొని ట్యూన్స్ తీసుకుంటాడనుకున్నాను. కానీ అద్భుతమైన మూడు మెలొడీస్‌ని నా నుంచి తీసుకున్నాడు. దర్శకుడిగా అతనిలోని పరిపక్వత నాకప్పుడు అర్థమైంది' అని కీరవాణి అన్నారు. ఇటీవలి సినిమాల్లో జైలర్, యానిమల్ చిత్రాల సంగీతం బావుందని ఆయన చెప్పారు. 'హరిహరవీరమల్లు' సినిమాకు సంబంధించిన మూడు పాటల రీకార్డింగ్ పూర్తయిందని, అలాగే, చిరంజీవి 'విశ్వంభర' మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా మొదలయ్యాయని అన్నారు. రాజమౌళి సినిమాకు సంబంధించిన మ్యూజిక్ పనులు ఇంకా మొదలవ్వలేదని కీరవాణి తెలిపారు.

కత్తులూ, నెత్తురే ఎక్కువ చూసి ఉండాది



'ఈ సముద్రం చేపలకంటే కత్తులూ, నెత్తురే ఎక్కువ చూసి ఉండాది. అందుకే దీన్ని ఎర్రసముద్రం అంటారు' అంటున్నారు ఎన్టీఆర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'దేవర' చిత్రంలోనిదీ డైలాగ్. కొరటాల శివ దర్శకుడు. సోమవారం చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. రోమాంచిత పోరాట ఘట్టాలు, పతాక స్థాయి భావోద్వేగాలతో గ్లింప్స్ ఆద్యంతం అలరించింది. ఆగ్రహం నిండిన కళ్లతో ఎన్టీఆర్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. సముద్రపు దొంగలు నౌకలను దోచుకోవడం, వారిని ఎన్టీఆర్ ఊచకోత కోసే సన్నివేశాలతో యాక్షన్ హంగామా కనిపించింది. అనిరుధ్ రవిచంద్రన్ ఇచ్చిన నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ 5న 'దేవర' చిత్రం తొలిభాగం విడుదలవుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, మురళీశర్మ కీలకపాత్రల్లో నటిస్తున్నారు.

దర్శకుడు కే జయదేవ్ కన్నుమూత



సీనియర్ జర్నలిస్ట్, సినీ దర్శకుడు కే జయదేవ్ కన్నుమూశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య యశోద, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జయదేవ్ దర్శకత్వం వహించిన 'కోరంగి నుంచి' చిత్రం పలు జాతీయ, అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. భారతరత్న సీఎన్ఆర్ రావుపై ఫిల్మ్స్ డివిజన్‌కు ఆయన డాక్యుమెంటరీ నిర్మించారు. ప్రముఖ దర్శకుడు, జర్నలిస్ట్ కెఎన్‌టి శాస్త్రికి జయదేవ్ చిన్న కుమారుడు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/WwIRX55 లో చదవండి.


ఆర్యవైశ్య సంఘాల నూతన కమిటీల సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్ర సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటి

టీడీపీ పాలనలోనే ఆర్యవైశ్యుల సంక్షేమం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి అర్బన్, జనవరి 8: ఆర్యవైశ్యుల సంక్షేమం తెలుగుదేశం పార్టీ పాలనలోనే ఎంతో బాగుందని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. ఆర్యవైశ్య సంఘాల నూతన కమిటీల ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ పెండేల వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో ఆలపాటి మాట్లాడుతూ, ప్రస్తుత పాలనలో వ్యాపారాలు ఎలా ఉన్నాయో అందరికీ తెలిసిందని, పరిపాలన బాగుంటేనే వ్యాపారం కూడా బాగా జరుగుతుందన్నారు. దీనికి తోడు వేధింపులు, జేటాక్సులతో వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అన్నివర్గాల సంక్షేమం ధ్యేయంగా ముందుకు సాగే టీడీపీ పాలన తిరిగి తెచ్చేందుకు ప్రతిఒక్కరూ ఆలోచిస్తున్నారని చెప్పారు. అనంతరం రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు పలు ఆర్యవైశ్య సంఘాల నూతన కార్యవర్గాలతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభలో ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర నేతలు చిన్ని రామసత్యనారాయణ, చుండూరు ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ దేసు యుగంధర్, కొణిజేటి గోపికృష్ణ, సంకా బాలాజీగుప్తా, కొల్లిపర వెంకటసుబ్బారావు, బపనపల్లి ప్రభాకర్, కేవీ గోపాలరావు, అనీల్‌కుమార్, మువ్వల శ్రీనివాసరావు, తూనుగుంట్ల శ్రీనివాసరావు, వీవీ శేషగిరిరావు, డాక్టర్ కొత్తమాసు శ్యాంప్రసాద్, డాక్టర్ కౌషిక్, న్యాయవాది మల్లికార్జునరావు ప్రసంగించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పెండేల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా వనమా వేణుగోపాలరావు, పట్టణ వాసవీ సేవాదళ్ అధ్యక్షుడిగా యక్కల శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బింగుమళ్ల పృథ్వీ, పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా కొండవీటి లక్ష్మీపద్మావతి, ప్రధాన కార్యదర్శిగా మాజేటి శారదాదేవి, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షునిగా తాళ్లూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా త్రిపురమల్లు అమరేంద్ర, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఇది దోపిడీ కోసం తెచ్చిన జీవో: పాటిబండ్ల

తెనాలి క్రైం, జనవరి 8: సీఎం జగన్ ఏకపక్షంగా తెచ్చిన 27/2023 ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ తెలిపారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కొనసాగిస్తున్న న్యాయవాదులకు సోమవారం బీజేపీ నాయకులు పాటిబండ్ల రామకృష్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పెద్దలు గత నాలుగున్నర సంవత్సరాలుగా పెద్దఎత్తున సాగించిన భూ కబ్జాలు, భూ దోపిడీలను చట్టబద్ధం చేసుకోవడానికే 512జీవోను తెచ్చారన్నారు. ఈ జీవోను తెచ్చేముందు కనీసం న్యాయవాదులు, మేధావులతో, రాజకీయ పార్టీలతో సంప్రదించకుండా ఏకపక్షంగా జీవో తీసుకువచ్చారని దీనివలన ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు, ఆక్రమించుకున్న అండలేని వారి భూములను రెవెన్యూ అధికారులను అడ్డంపెట్టుకుని సక్రమంగా మార్చుకోవడానికే దీనికి తీసుకువచ్చారన్నారు. ఈ జీవోను పూర్తిగా రద్దుచేసే వరకు బీజేపీ అడంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మందలపు వేణుగోపాలరావు, హరిదాసు గౌరీశంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు


ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట జనవరి 8: పట్టణంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు 515 రోజులుగా కొనసాగుతున్నాయని టీడీపీ సభ్యులు తెలిపారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌లో సోమవారం ఎన్నారై కళాశాల యాజమాన్యం సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. శివాజీచౌక్‌లోని అన్న క్యాంటీన్‌లో మాజీమంత్రి ఆలపాటి దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, మాదల కోటేశ్వరరావు, ముళ్ళపూడి వెంకట్, వెనిగళ్ళ శివప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు గుమ్మడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రణరంగచౌక్ సుందరీకరణకు శ్రీకారం

తెనాలి, మారీసుపేట జనవరి 8: పట్టణంలోని రణరంగచౌక్‌లో సోమవారం రణరంగచౌక్ సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొని భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుందర తెనాలిలో భాగంగా రణరంగచౌక్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహం నుంచి క్విట్ ఇండియా ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల స్మారక కట్టడాన్ని రూ.25లక్షలతో సుందరీకరణ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, మున్సిపల్ అధికారులు, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి చేయండి

● బీసీ సంక్షేమ యవజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్వారకా శ్రీను

తెనాలి, మారీసుపేట జనవరి 8: బీసీల సంక్షేమానికి సంఘ సభ్యులందరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ యువజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం ద్వారకాశ్రీను పిలునిచ్చారు. స్థానిక గంగానమ్మపేటలోని పట్టణ బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో సోమవారం పట్టణ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంటు వేముల కృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ యవజన సంఘ ఉపాధ్యక్షుడు ద్వారకా శ్రీను ముఖ్య అతిథిగా పాల్గొని నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే బీసీల కులగణను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులను ఆపాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి రావడానికి బీసీలను వాడుకొని అధికారం చేపట్టగానే ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన సంఘ జనరల్ సెక్రెటరీ కొల్లూరు హనుమంతరావు, జనసేన నాయకులు సోమరౌతు సతీష్, బీసీ నాయకులు పాల్గొన్నారు.


నిరాహార దీక్షలో పాల్గొన్న రైల్వే కార్మికులు

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

తెనాలి అర్బన్, జనవరి 8: కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ తెనాలి శాఖ ఛైర్మన్ కె.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. జాతీయ సంఘం పిలుపు మేరకు రిలే నిరాహార దీక్షల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు దీక్షలు నిర్వహించాలని సంఘం ఆదేశించిందన్నారు. రైల్వేశాఖలో ఎన్నోఏళ్లు పనిచేసి పదవీ విరమణ చేశాక సరైన పెన్షన్ అందకపోతే కుటుంబాలు ఇబ్బందులు పడతాయన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్‌కు ఆదేశించకపోతే రైల్వే ఉద్యోగులంతా సమ్మెకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి బాజీ హుస్సేన్, రామస్వామి, సాయికుమార్, రోశమ్మ, రాంబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ పోరుబాటను విజయవంతం చేయాలి: కేదార్‌నాథ్

కొల్లిపర, జనవరి 8: రాష్ట్ర స్థాయిలో ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ 9, 10తేదీల్లో నిర్వహిస్తున్న యూటీఎఫ్ పోరుబాటను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా కేదార్‌నాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు 9వ తేదీ ఉదయం 10గంటల నుంచి 10వ తేది రాత్రి 10గంటల వరకు 36గంటల ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి కాలేషావలి, యూటీఎఫ్ నాయకులు మృత్యుంజయరావు, ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రజాయాత్ర ప్రారంభం

● సంగం జాగర్లమూడి నుంచి అంగలకుదురుకు చేరిన యాత్ర

● భారీగా పాల్గొన్న టీడీపీ, జనశ్రేణి శ్రేణులు


సంగంజాగర్లమూడిలో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులతో పాదయాత్రగా వస్తున్న ఆలపాటి


సంగంజాగర్లమూడి వినాయకస్వామికి నమస్కరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి రూరల్, జనవరి 8: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెనాలి నియోజకవర్గంలో తలపెట్టిన ప్రజాయాత్ర సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మండలంలోని సంగంజాగర్లమూడికి తెలుగుదేశం, జనసేన పార్టీల శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఉదయం పాదయాత్ర ప్రారంభానికి ముందు గ్రామంలో ప్రసిద్ధిచెందిన వినాయకస్వామి వారి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భారీగా తరలివచ్చిన ఇరుపార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్రగా గ్రామంలో పర్యటిస్తూ ప్రజలందరికీ అభివాదం చేస్తూ మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముందుకు సాగారు. వైసీపీ ప్రభుత్వం ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రంలో సృష్టించిన అనేక ఇబ్బందులను ప్రజలకు వివరిస్తూ పాదయాత్రగా ముందుకుసాగారు. ఆదేవిధంగా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. వైసీపీ ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత కనీసం మౌలిక వసతుల కల్పన కూడా చేపట్టలేకపోమారని ఐదేళ్లలో ఎక్కడా కూడా అభివృద్ధి జరిగిన పరిస్థితి లేదని తెలియజేశారు. తెలుగుదేశం, జనసేన ఇరుపార్టీలు వైసీపీ ప్రభుత్వ పోకడను ప్రశ్నిస్తుంటే అవినీతి కేసులు పేరుతో నోరునొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. ప్రజలందరూ సంతోషంగా జీవించాలన్నా తిరిగి తెలుగుదేశం పార్టీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. ఇటీవల మృతిచెందిన సంగంజాగర్లమూడికి చెందిన టీడీపీ నాయకుడు శివశంకర్‌రావు కుటుంబాన్ని మాజీమంత్రి ఆలపాటి పరామర్శించి పార్టీ తరుపున అన్ని వేళల అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్ర అంగలకుదురు చేరుకుంది. గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, హెచ్‌సీవి ఎండీ, టీడీపీ సీనియర్ నాయకుడు కరణం వెంకటేశ్వరరావు, పలువురు గ్రామ పార్టీ నాయకులు మహిళలు పెద్దసంఖ్యలో హాజరై స్వాగతం పలికారు. మహిళలు హారుతులు ఇచ్చి మాజీమంత్రితో ముందుకు నడిచారు. అంగలకుదురులో మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కాఆనంద్‌బాబు పాదయాత్రకు సంఘీభావం తెలిపి పాదయాత్రలో ముందుకుసాగారు. గ్రామంలో టీడీపీ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. పాదయాత్ర చావావారి పాలెంలో పార్టీ శ్రేణులు మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనంద్‌బాబులకు ఘనస్వాగతం పలికారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన మాజీ మంత్రులు గ్రామస్థులకు ధన్యవాదాలు తెలుపుతూ పాదయాత్రను ముందుకు నడిపారు. అనంతరం తిరిగి కొలకలూరుకు పాదయాత్ర చేరుకుంది. తొలిరోజు సుమారుగా 18 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాదయాత్రలో పాల్గొని ముందుకు నడిపారు. కార్యక్రమంలో పిల్లి మాణిక్యాలరావు, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్. కేసన కోటేశ్వరరావు, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

11 మంది టీడీపీలో చేరిక

మండలంలోని అంగలకుదురులో వైసీపీకి చెందిన 11మంది టీడీపీలోకి చేరారు. వారిని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

అంగన్‌వాడీల ఆందోళన ఉధృతం

● నల్లబెలూన్లు ఎగరవేసి నిరసన

● మార్కెట్ సెంటర్‌లో మానవహారం

● ఎస్మా జీవో ప్రతుల దహనం


ఎస్మా ఆదేశాల ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు, నల్ల బెలూన్లు ఎగరవేసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

తెనాలి అర్బన్, జనవరి 8: ముఖ్యమంత్రి పాదయాత్రలో చేసిన హామీలను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఉధృతమైంది. మార్కెట్ సెంటర్‌లో సోమవారం నల్లబెలూన్లు ఎగురవేసి నిరసన తెలిపారు. ఎస్మా జీవో కాపీలను దహనం చేశారు. మానవహారంగా ఏర్పడి ఎస్మా వెనక్కి తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. కనీస వేతనం అమలు చేయాలని గత 28 రోజులుగా చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకుండా ఎస్మా ప్రవేశపెట్టడం చూస్తే జగన్ నియంతృత్వ ధోరణి అర్థమవుతుందని సీపీఎం కార్యదర్శి కె.బాబుప్రసాద్ విమర్శించారు. జిల్లా సంఘ అధ్యక్షురాలు ఎవిఎన్ కుమారి మాట్లాడుతూ, ఎలాంటి నిర్బంధాలు అయినా భరిస్తామని చెప్పారు. సమ్మె చేస్తున్న వినాయక విగ్రహం నుంచి పట్టణంలో జరిగిన ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. సంఘ నాయకులు పావని, నళిని, జయలక్ష్మి, లావణ్య మీనా, మాధవి, శాంతకుమారి, పద్మావతి, హుస్సేన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించి వైసీపీ ప్రభుత్వం అణిచివేయాలని చూడటం హేయమైన చర్య అని న్యాయవాది, టీడీపీ నాయకుడు షేక్ బాజీ సాహెబ్ ఆరోపించారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె సోమవారం 28వ రోజుకు చేరింది. అంగన్‌వాడీల దీక్షల శిబిరానికి న్యాయవాది సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ సందర్భంగా బాజీసాహెబ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల డిమాండ్లు న్యాయ సమ్మతమెనన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నిమ్మకూరి రమేష్ బాబు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు ఎంపీ సుకన్య, పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● చేబ్రోలు: అంగన్‌వాడీలను అణిచివేయాలని చూడటం దుర్మార్గపు చర్య అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండ లక్ష్మీనారాయణ ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రమైన చేబ్రోలులో దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలకు సోమవారం లక్ష్మీనారాయణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, గుంటూరు కార్యదర్శి కళ్యాణి, చేబ్రోలు మండల కార్యదర్శి రత్నమంజుల, సీఐటీయూ కార్యదర్శి సీహెచ్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర: ఎస్మా ప్రయోగించిన జీవో నెం 2ను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు కోటా చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో అంగన్‌వాడీ కార్యకర్తలు జీవో నెం.2 కాపీని దహనం చేసి ప్రభుత్వానికి నిరసన తెలిపారు.


కొల్లిపరలో జీవో పత్రుల దహనం


చేబ్రోలులో అంగన్‌వాడీల శిబిరం వద్ద మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండ లక్ష్మీ నారాయణ


దీక్షల శిబిరంలో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు


వేతనాల పెంపు జీవో విడుదల చేయాలి

● పారిశుధ్య కార్మికుల డిమాండ్ ● కొనసాగుతున్న నిరసనలు

పొన్నూరు టౌన్, జనవరి 8: పారిశుధ్య కార్మికులకు వేతనాల పెంపు జీవోను తక్షణమే విడుదల చేయాలన్ని సీఐటీయూ నాయకుడు నిమ్మకూరి రమేష్ బాబు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల సమ్మె సోమవారం 14వ రోజుకు చేరుకుంది. కార్మికులకు మద్దతు పలికిన రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరిపి వేతనాల పెంపుకు అంగీకరించిందన్నారు. కానీ ఇంత వరకు జీవో విడుదల కాలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్క్స్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం పెంచే వరకు సమ్మె ఉపసహరించేది లేదని కార్మిక సంఘ, సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో సోమవారం మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్మికులను పిలిచి ఎక్కడికక్కడ మాట్లాడాలని ప్రభుత్వం ఆదేశించడంతో వారితో చర్చించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ జస్వంతరావు, హెల్త్ ఆఫీసర్ నిర్మల, సీఐటీయూ నాయకులు హుస్సేన్‌వలి, కార్మిక సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. సమ్మె చేస్తున్నప్పటికీ పారిశుధ్య పనులను చేసేందుకు సహకారం అందించాలని అధికారులు కోరారు. కనీస వేతనపెంపు ప్రకటించకపోతే సహకారం అందించేది లేదని సమ్మెకూడా కొనసాగుతుందని కార్మిక సంఘాల నాయకులు బదులిచ్చారు. దీంతో ప్రభుత్వం ఆశించిన స్థానిక నేతలు, అధికారుల రాయబారం విఫలమైంది.

విశ్వవేద స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు


విశ్వవేద స్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు

తెనాలి, మారీసుపేట జనవరి 8: మండల పరిధిలోని అంగలకుదురులో సోమవారం విశ్వవేద స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను విద్యార్థులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల డైరెక్టర్ కాట్రగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు. విద్యార్థులు భోగిమంటలు వేసి, అందమైన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలను అలంకరించారు. బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అకడమిక్ ఇంచార్జ్ ఎ.భ్రమరాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కొల్లిపర, జనవరి 8: మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంక్రాంతి సంబరాల్లో పాల్గొని రంగవల్లికలు, హరిదాసు, ముగ్గుల్లో గొబ్బిమ్మలు, భోగిమంటలు వేయడంతో సంక్రాంతి విశిష్టతను చాటుకున్నాయి. ముగ్గులు చుట్టూ తిరుగుతూ చిన్నారులు పాడిన పాటలు, నృత్యాలు, భోగిపళ్ల పోయడం పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయులు సోమరౌతు లక్ష్మీకమల, వెంకాయమ్మ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మున్నంగి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన భోగిమంటలు


మృత్యుంజయరావును సన్మానిస్తున్న అకాడమీ సభ్యులు

ప్రతి ఒక్కరిలో సామాజిక సేవాతత్పరత ఉండాలి

● ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్

తెనాలి అర్బన్, జనవరి 8: సామాజిక సేవాతత్పరత ప్రతి ఒక్కరిలో ఉండాలని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో తెనాలి రామకృష్ణ అకాడమీ జీవిత సాఫల్య పురస్కారాన్ని సామాజికవేత్త మొవ్వా మృత్యుంజయ రావుకు ప్రదానం చేశారు. అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, నిత్య విద్యార్థిగా ఉన్న ఆయనకు ఈ పురస్కారం ఇవ్వడం యూనివర్శిటీకి గర్వకారణమన్నారు. జస్టిస్ కేజీ శంకర్ మాట్లాడుతూ, విద్యావేత్తగా ఎంతో సేవ చేశారని చెప్పారు. జేకేసీ కళాశాల అధ్యాపకులు సుధాకర్, విశ్రాంత డీఈవో రవికుమార్, మంజుల, గల్లా మధుసూదన్ ప్రసంగించారు. వెలగా సుభాష్‌చంద్రబోస్, ఆరాధ్యుల కన్నా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి: సాంబిరెడ్డి

కొల్లిపర, జనవరి 8: చంద్రబాబునాయుడు పాలనలోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందినట్లు రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అత్తోటలో టీడీపీ నాయకులు భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.


శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత

● ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్, జనవరి 8: మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. స్థానిక జేపీ నగర్‌లో శరణగతి గోష్టి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల శోభాయాత్రను సోమవారం పట్టణంలో నిర్వహించారు. ఈ యాత్రను ప్రారంభించి మాట్లాడుతూ, ప్రతి ఏటా ధనుర్మాస వ్రత మహోత్సవాలను 20 రోజులకు పైగా నిర్వహించడం అభినందనీయమన్నారు. శోభాయాత్రను ప్రియదర్శిని సంస్థల ఛైర్మన్ చందు రామారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, పున్నారావు, కఠారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం వివాదంలో ఇద్దరికి కత్తిపోట్లు

చేబ్రోలు, జనవరి 8: రేషన్ బియ్యం విక్రయించగా వచ్చిన నగదు పంపిణీ విషయంలో తలెత్తిన సంఘటనలో ఇద్దరు కత్తిపోట్లకు గురైన సంఘటన సోమవారం చేబ్రోలులో చోటు చేసుకుంది స్థానికుల కథనం ప్రకారం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన శ్యామ్యూల్, గరువుపాలెంక చెందిన మరో వ్యక్తి ఇద్దరు కలిసి రేషన్ బియ్యం సేకరించి రమేష్ అనే వ్యక్తికి చెందిన లారీలో రేషన్ బియ్యాన్ని రవాణా చేసి విక్రయిస్తుంటారు. ఈ రేషన్ బియ్యం విక్రయించిన నగదు లావా దేవీలో తేడావచ్చి వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఓ వైసీపీ నాయకుడు ప్రవేశించాడు. ఈ వివాదంలో రమేష్ అనే వ్యక్తితోపాటు, పవన్ అనే వ్యక్తికి కత్తి గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై చేబ్రోలు పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోలర్ స్కేటింగ్‌లో వివా విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న వీవీఐటీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, జనవరి 8: రోలర్‌స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖ పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వివా ది స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు వివా విద్యాసంస్థల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ సోమవారం తెలిపారు. విశాఖ పట్నంలో జరిగిన పోటీల్లో గ్రేడ్-3 విద్యార్థి మధుమాల ఆధ్య వెండి పతకాన్ని సాధించింది. గ్రేడ్ 9 భీమవరపు లిఖితారెడ్డి ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. గుంటూరులో రోలర్‌స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో 3బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు వీరిద్దరు ఎంపికైనట్లు తెలిపారు. వివా సంస్థ 11మంది వ్యాయామ ఉపాధ్యాయులతో అన్ని క్రీడలలో శిక్షణ అందిస్తుందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన ఆధ్య, లిఖితారెడ్డిలను ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, డైరెక్టర్ ఎల్టీ కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ సంధానకర్త కె. మాధవి, సీబీఎస్ఈ సంధానకర్త జోతి మెటిల్డా స్కేటింగ్ కోచ్ కె. కళ్యాణ్ అభినందించారు.

లయన్స్ సిటిజన్ క్లబ్ అధ్యక్షుడిగా గంగాధర్

పొన్నూరు టౌన్, జనవరి 8: పొన్నూరు లయన్స్ సిటిజన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గోడవలి గంగాధరరావు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. సోమవారం లయన్స్ క్లబ్‌లో సిటిజన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా గంగాధర్, కార్యదర్శిగా రవీంద్రకుమార్, కోశాధికారిగా వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా షేక్ మస్తాన్, శ్రీకాంత్‌లు ఎన్నికైయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు అనుబంధ సంఘాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాంబశివరావు తదితరులు

నీతిని బోధించే కథలు: గుమ్మా

తెనాలి అర్బన్, జనవరి 8: సాహిత్య ప్రక్రియలో కథలు ద్వారా పరోక్షంగా నీతిని ప్రబోధిస్తే పద్యాలు నేరుగా చెబుతాయని లయోలా కళాశాల విశ్రాంత అధ్యాపకుడు గుమ్మా సాంబశివరావు చెప్పారు. చెంచుపేటలోని రావి టవర్స్‌లో సామాజిక అంశాలు ఇతివృత్తంగా పిన్నక నాగేశ్వరరావు రచించిన సూక్తి పద్య సుధ పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. దూరదర్శన్ విశ్రాంత ఉపసంచాలకులు యార్లగడ్డ శైలజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిత్యజీవితంలో సూక్తులను తీసుకుని పద్య రూపం కల్పించడం అభినందనీయమన్నారు. నవయుగ కవి గుర్రం జాషువా చెప్పిన కృతునిచెందువాడు మృతుడు కాడు అనే అంశం అనుసరించిన వారు చరిత్రలో చిరంజీవులుగా మిగులుతారని చెప్పారు. అయినాల మల్లేశ్వరరావు, యార్లగడ్డ శరద్యుతి, లలిత శివజ్యోతి, రమేష్, చందన, సుబ్బారావు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌లో గుప్తా కళాశాల విద్యార్థుల ప్రతిభ


హ్యాండ్ బాల్ పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయకృష్ణ, కోచ్ నాగరాజు తదితరులు

తెనాలి, మారీసుపేట జనవరి 8: స్థానిక గంగానమ్మపేటలోని నూకల రామకోటేశ్వర రావు అండ్ కోటా శ్రీరాముల గుప్తా డిగ్రీ కళాశాలలో సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన క్రీడాకారులకు అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ గోగినేని విజయకృష్ణ పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. క్రీడలవలన క్రమశిక్షణ అలువడుతుందని, ఉద్యోగ అవకాశాలను పొందవచ్చన్నారు. అనంతరం కోచ్ కె.నాగరాజును సత్కరించారు. అలాగే 4వ తేదీన జరిగిన యూనివర్సిటీ సెలక్షన్‌లో మన కళాశాల విద్యార్థినులు పెరియార్ యూనివర్సిటీలో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్‌కు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం తరుపున ఎంపికయ్యారని తెలిపారు.

కార్యక్రమంలో యం శివనాగజ్యోతి, కె.కీర్తిబాయి, ధశరధ రామిరెడ్డి, డి.నాగేంద్ర బాబు, విద్యార్థులు పి.కాలేబు, శ్యాంసుందర్, శివశంకర్, మధుబాబు, జనార్ధనరెడ్డి, రాకేశ్, లోకేశ్, యశ్వంత్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.